



జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడీ

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి

- 88,000 మందికి సీసీఆర్సీ కార్డుల పంపిణీ
- 2027కి జిల్లాలోని అన్ని ఇళ్లకి తాగునీటి కుళాయిలు
- 51,000 ఎంటీ ధాన్యం కొనుగోలు.. రూ.117 కోట్ల జమ
- గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ వెంకటమురళి సందేశం
- ఆకట్టుకున్న డ్రోన్ విన్యాసాలు, శకటాలు, చిన్నారుల ప్రదర్శనలు



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటమురళి



ప్రథమ స్థానంలో నిలిచిన విద్యాశాఖ శకటం



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథాన నడపడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. స్థానిక పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం గణతంత్ర దినోత్సవం అట్టహాసంగా జరిగింది. జాతీయ జెండాను ఆవిష్కరించిన కలెక్టర్ పోలీసు, ఎన్‌సీసీ, స్కౌట్స్ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ప్రసంగిస్తూ ప్రభుత్వ లక్ష్యాలతో పాటు ఇప్పటి వరకు సాధించిన ప్రగతిని ఆయన వివరించారు. జిల్లాలో 2024 జూన్ నుంచి ఇప్పటి వరకు 5,436 క్వింటాళ్ల విత్తనాలను రాయితీపై రైతులకు అందించామన్నారు. కౌలు రైతులను ఆదుకోవడమే లక్ష్యంగా రికార్డుస్థాయిలో 88,000 మందికి సీసీఆర్సీ కార్డులు ఇచ్చామన్నారు. కాల్వల్లో పూడికతీతల కోసం 107 పనులకు రూ.7.61 కోట్లు కేటాయించామన్నారు. మనబడి-మన భవిష్యత్ రెండో దశలో ఎంపిక చేసిన 541 పాఠశాలల్లో పనులకు రూ.190 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా 2027 నాటికి జిల్లాలోని అన్ని ఇళ్లకి తాగునీటి కుళాయిల సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని 150 రైతు సేవా కేంద్రాల ద్వారా 8,050 మంది రైతుల వద్ద నుంచి 51,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 117 కోట్ల నగదును వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. అర్హులైన పేదలందరికీ పక్కా ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు

మురిసిన మువ్వెన్నలు

చిన్నారుల చేతుల్లో మువ్వన్నెల జెండాలు రెపరెపలాడుతుంగా గణతంత్ర వేడుకలు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా జరిగాయి. వేడుకలు జరుగుతున్న ప్రాంగణంలో డ్రోన్ ద్వారా గగనతలంలో జాతీయ పతాకం ఎగిరేలా అధికారులు చేసిన ఏర్పాట్లు అబ్బురపరిచాయి. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. టైగర్ జాగిలం అతిథికి గౌరవ వందనం సమర్పించి బొకే ఇవ్వడంతో పాటు చెమట వాసన ద్వారా కర్చీఫ్ కనిపెట్టిన విధానం ఆహుతులను మంత్రముగ్ధులను చేసింది. హర్డిల్ జంప్, ఫైర్ జంప్ విన్యాసాలు, బిట్టు జాగిలం పేలుడు పదార్థాలు ఉంచిన బాక్స్‌ను గుర్తించడం పోలీసు జాగిలాల ప్రతిభకు అద్దం పట్టింది. స్వాతంత్ర్య సమరయోధుల వారసులను కలెక్టర్ ప్రత్యేకంగా సన్మానించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన అధికారులకు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. పరేడ్ కమాండర్‌గా అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తుషార్‌డూడీ, జేసీ ప్రఖర్‌జైన్, ఏఎస్పీ విఠలేశ్వర్, ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, కొండయ్య, డీఆర్వో గంగాధర్‌గౌడ్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు

విద్యా శాఖ శకటానికి ప్రథమ స్థానం

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా వివిధ విభాగాలు ప్రదర్శించిన శకటాలు వేడుకల్లో ప్రత్యేకంగా నిలిచాయి. 18 విభాగాలు శకటాలను ప్రదర్శించగా విద్యాశాఖ శకటం తొలి బహుమతి దక్కించుకుంది. వైద్య ఆరోగ్య శకటానికి ద్వితీయ బహుమతి, అన్న క్యాంటీన్లతో రూపొందించిన మున్సిపాలిటీ శకటం తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నాయి. నృత్య ప్రదర్శనల్లో భాగంగా నర్సాయపాలెం అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతిని అందుకున్నారు. బేటీ పడావో బేటీ బచావో అంటూ బాలికల సంరక్షణపై ఏపీఆర్ఎస్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శన ద్వితీయ బహుమతిని, ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రదర్శన తృతీయ బహుమతిని గెలుచుకున్నాయి.



చిన్నారుల నృత్య ప్రదర్శన

హై టీకి హాజరైన మంత్రులు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి కలెక్టర్ బంగ్లాలో హై టీ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ జె.వెంకటమురళి ఇచ్చిన హైటీకి మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, గిద్దలూరి ఎమ్మెల్యే ముత్తుమూల అశోక్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. అతిథులకు కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడీలు పూలమొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జేసీ ప్రఖర్‌జైన్, ఏఎస్పీ విఠలేశ్వర్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, డీఈవో ఎస్.పురుషోత్తం, డీఎమ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా వ్యవసాయశాఖాధికారి రామకృష్ణ, ఆర్డీవో పి.గ్లోరియా, కమిషనర్ జి.రఘునాథరెడ్డి, తహసీల్దారు షేక్.సలీమా తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ వెంకటమురళికి పూలబొకే ఇస్తున్న పోలీసు జాగిలం



హై టీ కార్యక్రమంలో అధికారులు, చిన్నారులతో మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్

పర్చూరు అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- మంత్రులు గొట్టిపాటి, డోలా, అనగాని, జనార్ధన్ హామీ
- గ్రీన్‌స్పార్క్ ఫౌండేషన్, శిక్షణ కేంద్రాల ప్రారంభోత్సవం
- భారీగా రుణాల పంపిణీ.. వైద్య శిబిరం, సేవా కార్యక్రమాలు

మార్టూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పర్చూరు నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, బీసీ జనార్ధన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం మార్టూరుకు సమీపంలోని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయంలో జరిగిన పలు



వైద్య శిబిరంలో మంత్రి గొట్టిపాటికి బీపీ చూస్తున్న మరో మంత్రి డోలా, పక్కన మంత్రి అనగాని, ఒంగోలు ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే ఏలూరి తదితరులు

కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని క్యాంపు కార్యాలయంలో వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందించేందుకు ఆయన ఏర్పాటు చేసిన గ్రీన్‌స్పార్క్ ఫౌండేషన్ అనే సంస్థను మంత్రి డోలా ప్రారంభించారు. నియోజకవర్గంలోని యువతకు ఉపయోగపడేలా ఏర్పాటు చేసిన ఫిట్‌నెస్ సెంటర్(జిమ్)ను అనగాని, గొట్టిపాటి ప్రారంభించారు. నియోజకవర్గంలోని డ్వాక్రా మహిళలకు రూ.24 కోట్ల విలువైన రుణ మంజూరు పత్రాలను అందజేశారు. 54 మంది లస్కర్లకు ఉద్యోగ నియామక పత్రాలను ఇచ్చారు. 40 మంది దివ్యాంగులకు ఎలక్ట్రికల్ మోటారు సైకిళ్లను పంపిణీ చేశారు. 158 మంది వృద్ధులకు వీల్‌చైర్లు, చేతికర్ర, వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. వైద్య శిబిరాలకు వచ్చిన రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే సాంబశివరావు వినూత్నంగా చేపడుతున్న కార్యక్రమాలు నియోజకవర్గ అభివృద్ధిలో కీలకంగా మారనున్నాయన్నారు. ఈ కార్యక్రమాల్లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, ఆయా జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌లు ఏలూరికి ఫోన్‌చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్తమ పంచాయతీగా.. ఏట్రవారిపాలెం

కేంద్రమంత్రి నుంచి అవార్డు అందుకున్న సర్పంచ్

కర్లపాలెం, జనవరి 26 (ఆంధ్రజోతి): కర్లపాలెం మండలంలోని ఏట్రవారిపాలెం జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. గ్రామ సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి ఆదివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి ఎస్పీ సింగ్‌భఘేల్ నుంచి అవార్డు అందుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారుల సంతృప్తి, నీటి సరఫరా, పారిశుధ్యం, విద్య, ప్రజారోగ్యం వంటి అంశాల్లో మెరుగైన ఫలితాలు సాధించినందుకు ఏట్రవారిపాలెం పంచాయతీ జాతీయ స్థాయి అవార్డు దక్కించుకుంది. ఆయా అంశాల్లో కృషి చేసినందుకు సర్పంచ్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అభినందించి సత్కరించింది. ఈ అవార్డుకు దేశవ్యాప్తంగా 600 పంచాయతీలను ఎంపిక చేయగా బాపట్ల జిల్లా నుంచి ఏట్రవారిపాలెం గ్రామం ఎంపికైంది. సర్పంచ్‌కు ఢిల్లీలో నిర్వహించిన రిపబ్లిక్ వేడుకలకు ఆహ్వానం అందింది. దీంతో వెంకటలక్ష్మి ఢిల్లీలో జరిగిన గణతంత్రదినోత్సవ వేడుకల్లో భర్త శ్రీనివసారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌కి కేంద్ర సహాయ మంత్రి అవార్డును ప్రదానం చేశారు. జిల్లా పంచాయతీరాజ్ శాఖాధికారి ప్రభాకర్, ఎంపీడీవో అద్దూరి శ్రీనివారావు, తహసీల్దార్ సుందరమ్మ, జిల్లాలోని పలుశాఖల అధికారులు, సర్పంచ్‌లు అవార్డు అందుకున్న చీరాల వెంకటలక్ష్మికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.



ఢిల్లీలో కేంద్ర సహాయమంత్రి ఎస్పీ సింగ్ భఘేల్ నుంచి అవార్డు అందుకుంటున్న సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి

మిర్చికి.. నల్లతామర



- తెగుళ్లతో రైతుల విలవిల
- రోజు మార్చి రోజు మందుల పిచికారి
- ఎకరాకు రూ.1.50 లక్షల వరకు వ్యయం
- భారీగా దిగుబడులు తగ్గుతాయని ఆందోళన

నల్ల తామర.. మిర్చి పంటను వీడటంలేదు. ఈ ఏడు కూడా పురుగు పూత దశలోనే ఆశించింది. నల్ల తామర పురుగు మిరప రైతులను నలిపేస్తోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో నల్లతామర ఉధృతి ఉధృతంగా ఉంది. నల్ల తామరతో పాటు నల్ల, తెల్ల, పచ్చ నల్లి, ఆకు ముడత తెగుళ్లు మిర్చి పంటకు సోకాయి. నల్ల తామర వల్ల పూతతో పాటు కాయలు రాలిపోతున్నాయి. మొక్కలు ఎండిపోతున్నాయి. నల్ల తామరకు తోడు తెగుళ్ల నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. పురుగు మందుల కోసం ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు రైతులు ప్రత్యేకంగా ఖర్చు చేస్తున్నారు. పంటను కాపాడుకోవడానికి రోజు మార్చి రోజు మందులు పిచికారి చేయాల్సి వస్తోంది. మందులు పిచికారి చేస్తున్నా ఫలితం ఉండటం లేదని రైతుల వాపోతున్నారు. తెగుళ్లు పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడులు కూడా తిరిగిరావని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఈ ఏడు పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 1,66,768 ఎకరాల్లో మిరప పంట సాగైంది. పల్నాడు జిల్లాలో 1,02,881 ఎకరాల్లో, బాపట్ల జిల్లాలో 25,337 ఎకరాలు, గుంటూరు జిల్లాలో 38,550 ఎకరాల్లో మిరప సాగు చేశారు. తేజ, వండర్‌హాట్, చపాటా వంటి రకాలను ఎక్కువగా సాగు చేశారు. పంట పూత, కాపు దశలో తెగుళ్ల బెడద మొదలైంది. కొన్ని చోట్ల అకుముడత, మచ్చ తెగుళ్లతో మొక్కల్లో ఎదుగుదల లేదు. కాయ దశలో వైరస్, నల్ల, పచ్చ, తెల్ల నల్లి సోకడంతో కాయ ఎండి రాలిపోతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మొక్కలు వేసిన మొదట్లో ఆకుముడత వైరస్ వాహకంగా ఉండే తెల్లదోమ, ఆ తదుపరి నల్ల తామర, వైరస్ వల్ల దిగుబడి గణనీయంగా తగ్గుతోందని రైతులు తెలిపారు. పంటను తెగుళ్ల మింగేస్తుండటంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పొడి వాతావరణం వల్ల ప్రస్తుతం నల్ల తామర పురుగు ఉధృతి పెరుగుతున్నది.

పురుగు నివారణ చర్యలు

నల్ల తామర మూడేళ్ల మిరప పంటను ఆశించి నష్టపరుస్తోంది. వాతావరణం ఉష్ణోగ్రతలు 20 నుంచి 30 డిగ్రీలు ఉన్నప్పుడు దీని ఉధృతి అధికంగా ఉంటుంది. ఈ పురుగులు ఆకుల కింద వైపు, పువ్వులలో ఎక్కువ సంఖ్యలో చేరతాయి. పత్రహరితం గీకడం, రసం పీల్చడంతో కణజాలం దెబ్బతింటోంది. దీంతో ఆకులు మాడిపోయి, పువ్వులు గోధుమ రంగులోకి మరి రాలిపోతాయి. కాయ తయారయ్యే దశలో పిల్ల పురుగులు ఎక్కువగా ఆశించి రసం పీలస్తాయి. కాయలు గట్టిగా, గిడసబారి ఇటుకరాయి రంగులోకి మారిపోతాయి. గుడ్లు.. లార్వా.. ప్యూపా.. తల్లి దశలో పురుగు నివారించడానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలి.

- గుడ్డు దశలో ఆకు అడుగు భాగం తడిచేలా వేప నూనె పిచికారి చేయాలి. గుడ్లు పగలకుండా ముగిగిపోతాయి.
- లార్వా దశలో గుడ్ల నుంచి పిగిలిన లార్వా మొక్క కింద నేలపై పడుతుంది. మొక్క మొదళ్లలో వేప పిండి వేసుకుని నివారించవచ్చు.
- ప్యూపా దశ నెల ఉంటుంది. ఈ సమయంలో వేప పిండి లేదా వేప నూనె మొక్క మొదళ్లలో వేసుకుని నివారించవచ్చు.
- ప్యూపా దశ నుంచి రెక్కలు వచ్చిన తల్లి పురుగు నెల నుంచి మొక్క మీదకు ఎగిరే దశలో ఎకరాకు సుమారు 20 నీలి రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలి. పురుగులు నీలి రంగుకు ఆకర్షితమై జిగురు అట్టలకు అంటుకుని చనిపోతాయి.

మార్చిమార్చి పిచికారి చేయాలి

నాలుగు దశల్లో నివారణ చర్యల అనంతరం చివరిగా పురుగు మందులను పిచికారి చేసుకోవాలి. తొలుత తక్కువ సామర్థ్యంతో ప్రారంభించి ఎక్కువ పవర్ ఉన్న పురుగు మందులను పిచికారి చేసుకోవాలి. ఆ మందులను కూడా మార్చి మార్చి పిచికారి చేసుకోవాలి. డైమీథోయేట్ లీటర్ నీటికి రెండు ఎంఎల్ కలిపి పిచికారి చేయాలి. ఫిప్రొనిల్ లీటరుకు 2 ఎంఎల్, ఫిప్రొనిల్ + ఇమిడా క్లోప్రిడ్ లీటరుకు రెండు ఎంఎల్, బ్రోఫ్లానీలైడ్ ఎకరాకు 32 ఎంఎల్, ఫ్లూక్స మెటమైడ్ ఎకరాకు 160 ఎంల్ పిచికారి చేయాలి.

- సీహెచ్‌వీ రమణారెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి, పల్నాడు

నిరంతర అధ్యయనం అవసరం



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జనవరి 26 (ఆంధ్రజ్యోతి): డీవీసీ హాస్పిటల్లో వర్క్ షాప్ వైద్య విధానంలో వస్తున్న మార్పులపై నిరంతరం అవగాహన కలిగి ఉండట మే కాకుండా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని యూనివర్సిటీ అబ్జర్వర్, కారుమూరి హాస్పిటల్స్ నిర్వాహకులు డాక్టర్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వడ్లమూడి డీవీసీ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్లో ఆదివారం ఈసీజీ, హృదయ సంబంధిత వ్యాధులపై వర్క్ షాప్ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాలతో జిల్లాలోని గ్రామీణ ప్రాంత వైద్యులు, పీజీ విద్యార్థులకు ఈ వర్క్‌షాప్ జరిగింది. డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈసీజీ విధానం ద్వారా హృదయ సంబంధిత వ్యాధులను గుర్తించవచ్చు అన్నారు. ఈసీజీలో వస్తున్న మార్పులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. ఈసీజీ విధానం పరిశీలిస్తే గుండెతోపాటు శరీరంలోని రుగ్మతలను ముందే గుర్తించవచ్చని తెలియజేశారు. డీవీసీ హాస్పిటల్ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో అత్యాధునిక వసతులు డీవీసీ హాస్పిటల్లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ పూర్ణానంద, ఆయుష్ హాస్పిటల్ కార్డియాక్ విభాగం డాక్టర్ శ్రీనివాస్ చౌదరి, ఎన్ఆర్ఐ హాస్పిటల్ హెచ్‌వోడీ డాక్టర్ జాన్ సతీష్, కార్డియాక్ సీనియర్ వైద్యులు, డాక్టర్ దక్షిణామూర్తి తదితరులు వైద్య విధానంలో వస్తున్న మార్పులను వివరించారు. డీవీసీ హాస్పిటల్ ఎండీ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్, సీవోవో డాక్టర్ కరణం నవీన్, డాక్టర్ రామకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వంటమాస్టర్ అనుమానాస్పద మృతి



మృతుడు కరీంబాషా

తెనాలి, మారీసుపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): హోటల్‌లో వంటమాస్టర్‌గా పని చేసే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక యడ్లలింగయ్య కాలనీకి చెందిన మహమ్మద్ కరీంబాషా (29) చెంచుపేటలో ఓ హోటల్‌లో వంటమాస్టర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి తల్లి, ఇద్దరు సోదరులు ఉన్నారు. శనివారం కుటుంబ సభ్యులకు పనికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి రాత్రైనా ఇంటికి తిరిగిరాలేదు. ఉదయం తాను నివసించే కాలనీలో సైడు కాలువలో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతినికి మద్యం అలవాటు ఉండటంతో పూటుగా తాగి మద్యం మత్తులో కాలువలో పడి ఉండవచ్చునని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫేక్ రిజిస్ట్రేషన్ కేసులో నిందితులకు రిమాండ్

నరసరావుపేట లీగల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఫేక్ రిజిస్ట్రేషన్ కేసులో నిందితులైన బాపట్ల జిల్లా.. బాపట్ల మండలం బెస్తవారిపాలెంకు చెందిన దైవనాయక్ మూర్తికుమార్, ముత్తాయపాలెంకు చెందిన నక్కల నాగార్జునల కు రిమాండ్ విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆశీర్వాదంపాల్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. నిందితులు బాపట్ల జిల్లాకు చెందిన వేరే వ్యక్తులకు చెందిన స్థలాన్ని తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో నరసరావుపేట సబ్ రిజిస్టర్ ఆఫీస్‌లో సంవత్సరం క్రితం రిజిస్ట్రేషన్ చేశారు. ఒరిజినల్ ఓనర్లు రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతా ధికారులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి నరసరావుపేట జాయింట్ రిజిస్ట్రార్ మొదటి పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

మానవాళికి మార్గం చూపిన ఏసుక్రీస్తు

- రక్షణ సువార్తను నిర్లక్ష్యం చేయవద్దు
- బైబిల్ మిషన్ అధ్యక్షుడు జె.శామ్యూల్ కిరణ్



బైబిల్ మిషన్ మహోత్సవాలకు హాజరైన భక్తులు

పెదకాకాని, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రేమ, దయ, జాలి, త్యాగం, క్షమాగుణం వంటి లక్షణాలతో ఎన్నో అద్భుతాలు చేసి సమస్త మానవాళికి మార్గం చూపిన ఏసుక్రీస్తు ప్రభువు శ్రేష్ఠుడని బైబిల్ మిషన్ అధ్యక్షుడు, మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట మహోత్సవాల ప్రాంగణంలో నాలుగు రోజుల పాటు జరిగే బైబిల్ మిషన్ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం కాకాని స్వస్తిశాల సంగీత బృందం ప్రత్యేక క్రైస్తవ భక్తి కీర్తనలు ఆలపించారు. అనంతరం జె.శామ్యూల్ కిరణ్ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రైస్తవ భక్తుల్లో ఆధ్యాత్మికత పెంచేందుకు, నిత్య సంతోషం పొందేందుకు మహోత్సవాలు దోహద పడతాయన్నారు. నాలుగు రోజులు మహోత్సవాల్లో పాల్గొనడం ద్వారా ఆశీర్వాదం, దీవెన, అన్ని అంశాలలో విజయం సాధించడానికి ఒక మార్గంగా భక్తులు విశ్వసిస్తారని తెలిపారు. ఆత్మీయ జీవితంలో శ్రేష్ఠమైన అంశాలను ఉదహరించారు. దేవుని మాట వినుట, దేవాలయంలో గడుపుట, ప్రేమ, నీతి, విశ్వాసం కలిగి ఉండటం పరిపూర్ణమైన క్రైస్తవ జీవితానికి అర్థం అన్నారు. రక్షణ సువార్తను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. దుష్ట హృదయం లేకుండా సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. ప్రార్థన ధూపం దేవునికి ఇష్టమనీ, ప్రతి ఒక్కరూ ప్రేమ సమాధానాలు కలిగి ఉండాలని కోరారు. అదేవిధంగా ప్రజలందరూ ఎల్లప్పుడూ దేవుని దయలో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆశీర్వాదం పలికారు. తొలుత బైబిల్ మిషన్ సెక్రటరీ కె.ప్రశాంత్ కుమార్, రాజు, పి.ప్రకాష్ ఓనేసం, సత్య ప్రకాష్, డాక్టర్ డేనియల్ దినకర్ దైవ సందేశాలు అందించారు.

భక్తులతో పోటెత్తిన ప్రాంగణం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కేరళ, బీహార్, పశ్చిమ బెంగాల్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు, సింగపూర్, మలేషియా, అమెరికా, దుబాయ్ దేశాల నుంచి భక్తులు పాల్గొనడంతో ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మహోత్సవాలతోపాటు ఆదివారం దైవారాధన కూడా కావడంతో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో దేవున్ని ఆరాధించారు. పెదకాకాని స్వస్తిశాలకు భక్తుల తాకిడి పెరిగింది.

నేటి షెడ్యూల్ ఇలా..

సోమవారం మహోత్సవాల కార్యక్రమంలో తెల్లవారుజామున ధ్యానం, క్రైస్తవ కీర్తనల ఆలాపన, దైవ సందేశాలు ఉంటాయని మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్ పేర్కొన్నారు.

మువ్వన్నెల రెపరెపలు

- ఘనంగా 76వ గణతంత్ర వేడుకలు

విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆయా కార్యాలయాల అధిపతులు ఆదివారం జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం రానున్న కాలంలో వారు సాధించాలనుకున్న లక్ష్యాలను వివరించారు.

ఏఎన్‌యూలో...



ప్రసంగిస్తున్న వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, జనవరి 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ స్ఫూర్తి పరిఢవిల్లాలని వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య గంగాధరరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో 76వ గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. వేడుకలకు ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి అధ్యక్షత వహించారు. ముందుగా ఆచార్య గంగాధరరావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ లక్ష్యాలు, విధులను కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రంగయ్య, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎం.సురేష్ కుమార్, ఆచార్య కె.వీరయ్య, ఆచార్య ప్రమీలారాణి, ఆచార్య పి.సిద్దయ్య, ఆచార్య పి.జాన్సన్, పాలక మండలి సభ్యులు ఆచార్య కె. సుమంత్ కుమార్, ఆచార్య ఎం.జగదీష్ నాయక్, ఆచార్య ఎస్.మురళీ మోహన్, ఓఎస్డీ ఆచార్య రవికుమార్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు, కోఆర్డినేటర్ ఆచార్య రామచంద్రన్, పీజీ పరీక్షల కోఆర్డినేటర్ సుబ్బారావు, సీడీసీ డీన్ రవికుమార్, విభాగాధిపతులు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

సెంట్రల్ జీఎస్‌టీ కార్యాలయంలో...



ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేసిన కమిషనర్ నరసింహారెడ్డి

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ జీఎస్‌టీ ఉద్యోగులు దేశ ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని సెంట్రల్ జీఎస్‌టీ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఆదివారం గుంటూరు కన్నావారితోటలోని సీజీఎస్‌టీ భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సందర్భంగా అంకితభావంతో పనిచేసిన అధికారులకు కమిషనర్ నరసింహారెడ్డి ప్రశంసాపత్రాలు అందజేశారు. తొలుత అధికారులు నిర్వహించిన పరేడ్‌లో కమిషనర్ గౌరవ వందనం స్వీకరించారు. నల్లపాడు కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు జానపదం, శాస్త్రీయ నృత్యాలతో అలరించారు. కాసుల కృష్ణంరాజు చేసిన మ్యాజిక్ షో, డ్రాగన్ షో ఉద్యోగులను అలరించాయి.

నల్లపాడు రైల్‌విహార్‌లో...



రైల్ విహార్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో డీఆర్ఎం రామకృష్ణ

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): నల్లపాడులోని రైల్‌విహార్‌లో గణతంత్ర దినోత్సవంను రైల్వే శాఖ ఘనంగా నిర్వహించింది. గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.రామకృష్ణ జాతీయ జెండాని ఎగుర వేసి గణతంత్ర దినోత్సవ సందేశాన్నిచ్చారు. ప్రయాణికుల సేవలో పునరంకితమౌదామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం కె.సైమన్, ఎస్‌సీఆర్ మహిళ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు ఆశలత పాల్గొన్నారు.

ముద్దాయిలు నేరాన్ని అంగీకరించింది నిజం కాదా..

- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



జిమ్ జానీపై దాడి చేసిన వైనాన్ని చూపుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణానికి చెందిన జిమ్ జాని ఇంటిపై దాడి కేసులో ప్రధాన ముద్దాయిలపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్న సమయంలో, ముద్దాయిలు నేరాన్ని అంగీకరించింది నిజం కాదా అని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలపై బ్రహ్మనాయుడు మాట్లాడుతుంటే హాస్యస్పదంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అమాయికులపై తప్పుడు కేసులు పెట్టి, అట్రాసిటి కేసులు నమోదు చేసి, నేడు చట్టాల గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవ చేశారు. గత ప్రభుత్వంలో బొల్లా అండతో కొందరు అల్లరు మూఖలు ఆడపిల్లలను అల్లరిచేస్తే వారిపై కనీసం కేసు కూడా పెట్టకుండ వదిలేశారని, హత్యకు గురైన రషీద్, జిలాని ఇద్దరు స్నేహితులని, ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణను ఖండించక పోవడంతో పలు అరాచకాలకు బొల్లానే మూల కారణం అయ్యారని ఆరోపించారు. గతంలో వల్లెం శేషమ్మ బతికుండకానే మృతి చెందినట్లు ధ్రువీకరించారనీ, 70 సంవత్సరాల వృద్ధురాలు లక్ష్మమ్మపై హత్యయత్నం జరిగితే కనీస విచారణ చేయలేదని వివరించారు. మద్దతు ధర అడిగితే రైతును జైలుకు పంపిస్తారా అని నిలదీశారు. క్రిస్టియన్, ముస్లిం, మైనార్టీల ఆస్తులకు రక్షణ కల్పిస్తాం అన్నారు. బొల్లా బ్రహ్మనాయుడు కారుచౌకగా క్రిస్టియన్ ప్రాపర్టీని కొనుగోలు చేసి, తర్వాత కంపెనీ పేరు పెట్టుకున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ సబ్‌జైలులో అరాచక శక్తులను పరామర్శించి బయటకు వచ్చి పోలీసులపై నిందలు వేస్తారా అని ప్రశ్నించారు.

పవన్ ఆలోచన, చంద్రబాబు విజన్ రాష్ట్రానికి అవసరం

- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
- జనసేన క్రియాశీల సభ్యుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ



బీమా చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

మంగళగిరి సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పవన్ కల్యాణ్ ఆలోచనలు, చంద్రబాబు విజన్ ఈ రాష్ట్రానికి ఎంతో అవసరమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. తిరుపతి, చిత్తూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలకు చెందిన జనసేన పార్టీ క్రియాశీల సభ్యుల కుటుంబాలకు బీమా చెక్కులను ఆదివారం మంగళగిరి పట్టణంలోని చిల్లపల్లి నాగేశ్వరరావు కల్యాణ మండపంలో పంపిణీ చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ పంపిన రూ.5 లక్షల చొప్పున చెక్కులను 22 కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ విజన్ లేని నాయకుడితో రాష్ట్ర ప్రజలు నష్టపోతారని, అందుకు ఐదేళ్ల వైసీపీ పాలనే నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పటి వరకు దురదృష్టకర పరిస్థితుల్లో 928 మంది క్రియాశీల సభ్యుల కుటుంబాలకు బీమా పథకం ద్వారా రూ.24 కోట్ల మేర అందజేశామన్నారు. ప్రభుత్వం లేనప్పుడు కూడా ఆపత్కాలంలో పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలిచామని, పవన్ కల్యాణ్ ఎన్నో సందర్భాల్లో తన సొంత నిధుల నుంచి సాయం అందించారని తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, మాల వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్, అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ టీసీ వరుణ్, జనసేన కార్యక్రమాల నిర్వహణా విభాగం కన్వీనర్ కల్యాణం శివశ్రీనివాస్, పీఏసీ సభ్యుడు కోన తాతారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, నేతలు గాదె వెంకటేశ్వరరావు, షేక్ రియాజ్, నయూబ్ కమాల్, సయ్యద్ జిలానీ, సుంకర శ్రీనివాస్, సురేష్, కిరణ్ రాయల్, గంజి చిరంజీవి, శివపార్వతి పాల్గొన్నారు.

నకిలీ సిగరెట్లు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

గుంటూరు జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద నకిలీ సిగరెట్లు విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. హౌసింగ్ బోర్డు కాలని హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న రెండు కిళ్లీ బంకులలో బావ, బావమరుదులైన వెంకటేశ్వర ట్రేడర్స్ నిర్వాహకులు కోట అప్పారావు, కాకుమాను వెంకట వరప్రసాదరావు నకిలీ సిగరెట్‌లు విక్రయిస్తున్నారు. వారి నుంచి 700 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ సిగరెట్ల ఖరీదు రూ. 12,900 ఉంటుందని సీఐ వంశీధర్ తెలిపారు. ఇరువురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

నాట్కో ట్రస్ట్‌కు ప్రత్యేక సేవా అవార్డు



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న సదాశివరావు

గుంటూరు (మెడికల్) జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్య, వైద్య రంగాల్లో తమ వంతు సామాజిక సాయం అందిస్తున్న నాట్కో ట్రస్ట్‌కు గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక అవార్డు లభించింది. కొన్నేళ్లుగా నాట్కో ట్రస్ట్ జిల్లాలో పలు ప్రభుత్వ పాఠశాలలు, గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో రూ.కోట్లు వెచ్చించి పలు అభివృద్ధి పనులు చేస్తుంది. గుంటూరు జీజీహెచ్‌లో రూ.40 కోట్ల వ్యయంతో నాట్కో క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణంతో పాటు శిశు వైద్య విభాగం, డయాలసిస్ వార్డు, మానసిక వైద్య విభాగం సెమినార్ హాల్‌ను అభివృద్ధి చేసింది. త్వరలో రూ.20 కోట్ల వ్యయంతో 150 పడకలతో కూడిన క్యాన్సర్ వార్డును కొత్తగా నిర్మించనుంది. ఈ నేపథ్యంలో ట్రస్ట్ సేవలను గుర్తించిన జిల్లా అధికార యంత్రాంగం ఆదివారం పోలీసు కవాతు మైదానంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ నాగలక్ష్మి, నాట్కో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (కార్పొరేట్ ఎఫైర్స్) నన్నపనేని సదాశివరావుకు అవార్డును, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. నాట్కో కేన్సర్ సెంటర్ సమన్వయకర్త యడ్లపాటి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

నన్ను కొట్టిన వారిని చూసి వస్తా

- పార్టీ శ్రేణులతో డిప్యూటీ స్పీకర్ రఘురామ



పార్టీ నాయకులు కనపర్తి, చిట్టిబాబు, నాని తదితరులతో రఘురామకృష్ణరాజు

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజుపై గతంలో జరిగిన కస్టోడియల్ టార్చర్ కేసులో నిందితులు గుంటూరు జిల్లా జైలులో ఉండగా వారిని గుర్తించేందుకు ఆదివారం ఆయన ఇక్కడికి వచ్చారు. జిల్లా జైలులో తులసి బాబు ఐడెంటిఫికేషన్ టెస్ట్ పరేడ్‌కు ఆయన హాజరయ్యారు. అప్పట్లో ఆయన వైసీపీ ఎంపీగా ఉన్నప్పటికీ ఆయన్ను అరెస్టు చేసిన సమయంలో జిల్లా కోర్టు వద్దకు, అలాగే జైలు వద్దకు పెద్ద సంఖ్యలో టీడీపీ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి సంఘీభావంగా నిలిచారు. నేడు కూడా పలువురు పార్టీ నాయకులు కోర్టు, జైలు వద్దకు వచ్చి ఆయనకు మద్దతుగా నిలిచారు. జైలు వద్ద టీడీపీ నాయకులు కనపర్తి శ్రీనివాసరావు, చిట్టాబత్తిన చిట్టిబాబు, చిరుమామిళ్ళ నానితో పాటు నాటి వైసీపీ బాధితులు కంచేటి సాయి కుమార్, దండా నాగేంద్ర, దేవరపు గాంధీ, పలువురు పార్టీ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. ఆనాడు తనపై తప్పుడు కేసు పెట్టి కొట్టి నిర్బంధించింది ఈ జైల్లోనే కదా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు తనపై హత్యాయత్నం చేసిన నిందితులు ఈ జైల్లోనే ఉన్నారట చూసి వస్తాను అంటూ పార్టీ శ్రేణులకు చెప్పి లోనికి వెళ్లారు. ఆ తర్వాత జరిగిన మీడియా సమావేశంలోనూ విలేకరులు నాటి పరిస్థితులపై ప్రశ్నించినప్పుడు నాటి చీకటి రోజులను ఎందుకు గుర్తు చేస్తారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

పరిశోధనతో కూడిన రచనలు రావాలి

- స్త్రీవాద రచయిత్రి ఓల్గా



సదస్సులో మాట్లాడుతున్న స్త్రీవాద రచయిత్రి పోపూరి అరుణ కుమారి(ఓల్గా), వేదికపై సురేష్‌బాబు, శివప్రసాద్, మోహనరావు

యడ్లపాడు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వేధింపులపై లోతైన అధ్యయనం, పరిశోధనతో కూడిన రచనలు, నాటకాలు రావాలని ప్రముఖ స్త్రీవాద రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పోపూరి అరుణకుమారి(ఓల్గా) అభిప్రాయం వ్యక్తం చేశారు. యడ్లపాడులో కేంద్ర సాహిత్య అకాడమీ, తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం(వేదిక) సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు నాటకం.. స్త్రీవాదంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. వేదిక అధ్యక్షుడు ముత్తవరపు సురేష్‌బాబు అధ్యక్షతన జరిగిన సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళల మీద జరుగుతున్న లైంగిక దాడులు, మాతృత్వ పోకడలు, శ్రమైకజీవనం వంటి సమస్యలను సృజనాత్మకంగా అధ్యయనం, పరిశోధనలు చేసి రచయితలు రచనలు చేస్తే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. సాహిత్య అకాడమీ తెలుగు సలహా సంఘం సభ్యుడు వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ తెలుగునాట స్త్రీవాద రచనలు ప్రవేశించి నాలుగు దశాబ్దాలు గడిచాయన్నారు. వేదిక అధ్యక్షుడు ముత్తవరపు సురేష్‌బాబు మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రజా సమస్యలు, ఉద్యమాలు నేపథ్యంగా తమ ప్రయాణం సాగుతుందన్నారు. ప్రారంభసభ అనంతరం ఉదయం 11.30 గంటలకు వివేక సొసైటీ అధ్యక్షుడు అంబటి మురళీకృష్ణ అధ్యక్షతన తొలి సమావేశం జరిగింది. వర్తమాన నాటక రచయిత పిన్నమనేని మృత్యుంజయరావు అధ్యక్షతన రెండో సమావేశం జరిగింది.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

- మరొకరికి గాయాలు

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్లపాడు రోడ్డులోని సుభాని హోటల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మైనర్ మృతి చెందడంతో మరో మైనర్ గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న చౌత్రా సెంటర్‌కు చెందిన రోహిత్ కృష్ణ (17) అక్కడిక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న తరుణ్ గాయపడ్డాడు. వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య తెలిపిన వివరాల మేరకు.. చౌత్రా సెంటర్‌కు చెందిన వసంతకు ఆమె భర్తకు మనస్పర్థలు రావడంతో విడివిడిగా ఉంటున్నారు. వసంత కుమార్తెకు వివాహం కాగ, కుమారుడు రోహిత్ కృష్ణతో కలసి ఉంటోంది. తల్లి ఇళ్లల్లో వంట పనులకు వెళుతూ జీవనం సాగిస్తుంది. కుమారుడు రోహిత్ కృష్ణ 8వ తరగతితో చదువు మానేసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. ఆదివారం తల్లి మోపిదేవి గుడికి వెళ్ళగా, రోహిత్ కృష్ణ, తన స్నేహితుడైన తరుణ్‌తో కలిసి పక్కింటి వారి నుంచి స్కూటీ తీసుకుని నల్లపాడు వైపు వెళ్లారు. సుభాని హోటల్ వద్దకు వెళ్లేసరికి ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. ద్విచక్ర వాహనాన్ని రోహిత్ కృష్ణ నడుపుతుండగా, తరుణ్ వెనుక కూర్చున్నాడు. ఈ ప్రమాదంలో రోహిత్ కృష్ణ అక్కడిక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న తరుణ్ గాయపడ్డాడు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 555.40 అడుగులు ఉంది. ఇది 221.83 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9567 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7272 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 19,319 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	145,154,165
చికెన్ విత్ స్కిన్	280.00
చికెన్ స్కిన్ లెస్	290.00

శోభన్‌బాబు జయంతి పురస్కరించుకుని అన్నదానం

రేపల్లె, జనవరి 26(ఆంధ్రజ్యోతి) : దివంగత సినీనటుడు శోభన్‌బాబు 89వ జయంతిని పురస్కరించుకుని గరువురోడ్డులోని చిల్డ్రన్స్ హోమ్‌లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీలిశెట్టి చలపతిరావు, ఎం.రామసుశీల, నవీన్, ఎం.సాంబశివరావు, సీహెచ్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు



బాపట్ల టీడీపీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఆదివారం గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ జాతీయ జెండాను ఎగురవేసి అక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తి కలిగి జీవించాలన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను గుర్తుంచుకొని ఆయన స్ఫూర్తితో పని చేయాలన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని మార్కెట్ యార్డులో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే నరేంద్రవర్మ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు ఏడీ రమేష్‌బాబు, సెక్రటరి మోహనరావు, మార్కెట్ యార్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కార్యాలయ ఆవరణలో...



బాపట్ల ఎంపీ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ కార్యాలయ ఆవరణలో జాతీయ పతాకాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ కార్యాలయ ఆవరణలో...

బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పిట్టలవానిపాలెం మండల అధ్యక్షుడు హుస్సేన్‌బేగ్, ఏరియా హాస్పటల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యురాలు, ఉమ్మడి గుంటూరు జిల్లా లీగల్ సెల్ సభ్యులు జిడుగు విజయమాధురి, సీహెచ్ సత్యనారాయణ, ఆరుమళ్ళ సుజిత తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో...

పట్టణంలోని పటేల్ నగర్ బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ జాతీయ జెండా ఎగురవేసి భారతమాతకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షులు బ్రహ్మాండం బాలనారాయణ, మాజీ అధ్యక్షులు మామిడి రమేష్‌కుమార్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్లో జెండా ఆవిష్కరించిన జేసీ...

గణతంత్ర దినోత్సవాల్లో భాగంగా స్థానిక కలెక్టరేట్లో ఆదివారం జేసీ ప్రఖర్‌జైన్ జాతీయజెండాను ఎగురవేశారు. అనంతరం పోలీసు వందనం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పేదరికం లేని ప్రాంతంగా బాపట్ల జిల్లాను తీర్చిదిద్దడానికి తనవంతు ప్రయత్నిస్తానని ఆయన అన్నారు. ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్ జాతీయ జెండాను ఎగురవేసి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ బద్దంగా ప్రతి పోలీసు నిష్పక్షపాతంగా, నిబద్దతతో విధులు నిర్వహించాలని సూచించారు

బాపట్ల పురపాలక సంఘ కార్యాలయంలో...



బాపట్ల పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాను ఎగుర వేస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి

బాపట్ల పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కమిషనర్ మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను నిత్యం స్మరించుకోవాలని తెలిపారు. ఈ వేడుకలలో మున్సిపల్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ జి.ప్రసాద్, రెవెన్యూ అధికారి అబ్దుల్ జబ్బార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు సీహెచ్ కరుణ, డి.శ్రీనివాసరావు, పురపాలక సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ ఇన్‌చార్జి జి.రవిబాబు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కేవీఎస్ రామిరెడ్డి, డాక్టర్ బీఎస్ శ్రీనివాసులరెడ్డి, విజయ్‌కుమార్, డాక్టర్ బి.రాజ్‌కిరణ్, డాక్టర్ కె.కృపావతి, డాక్టర్ కె.లావణ్య, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పద్మ తులసీ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అసోసియేట్ డీన్ సి.సి.ఎస్సీ గుంటూరు డాక్టర్ జాగర్లమూడి లక్ష్మీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఇ.గౌతమి, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, బాపట్ల మహిళా సమైక్య ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు దేశభక్తి వేషధారణను వేయగా చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు రాజ్యాంగం, వ్యాసరచన, దేశభక్తి అంశంపై చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను సంస్థ అధ్యక్షుడు వీవీ సత్యనారాయణ, డాక్టర్ బి.శరత్‌బోస్, జి.శాంతారాం, మహిళా సమైక్య అధ్యక్షురాలు కె.పద్మజ, కార్యదర్శి బి.అనంతకుమారి, ట్రెజరర్ ఎన్.ప్రసన్నకుమారి, గోపాళం నాగలక్ష్మి, తోట రామాంజనేయులు, కె.సుబ్బారావు అందజేశారు.



బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు

బాపట్ల మండలంలో...

బాపట్లరూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలల వద్ద గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బాపట్ల సూర్యలంక మెరైన్ పోలీసుస్టేషన్ ఆవరణలో మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి సెల్యూట్ చేశారు. ఈ కార్యక్రమంలో మెరైన్ ఎస్సై శ్రీనివాసరావు, సిబ్బంది, గజ ఈతగాళ్ళు పాల్గొన్నారు. అదేవిధంగా బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల, బాపట్ల పబ్లిక్ స్కూల్, బాపట్ల ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల, బాపట్ల పాలిటెక్నిక్ కళాశాల, బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీ, బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. బాపట్ల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ సలీమా, బాపట్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో బాబురావు, బాపట్ల రూరల్ పోలీసుస్టేషన్ ఆవరణలో రూరల్ సీఐ శ్రీనివాసరావు జాతీయ జెండాను ఎగురవేశారు.



పిట్టలవానిపాలెం తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్ పి.మెహర్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు

● పిట్టలవానిపాలెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో 76వ గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఈవోపీఆర్డీ ఎ.ఏలీషాబాబు, కార్యాలయ సిబ్బంది జాతీయ జెండాను ఎగురవేశారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పి.మెహర్‌కుమార్, విద్యుత్‌శాఖ కార్యాలయంలో విద్యుత్ శాఖాధికారి ఏఈ కె.చంద్రశేఖరరావు, మండల విద్యాశాఖకార్యాలయంలో ఎంఈవో-2 కె.రాజారత్నం, చందోలు పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ ఆర్.స్వామి శ్రీనివాస్, పోలీసు సిబ్బంది, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ శాఖాధికారులతో కలిసి జాతీయ జెండాను ఎగరవేశారు. అన్ని గ్రామపంచాయతీలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు జాతీయ జెండాను ఎగురవేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో జాతీయ జెండాను ఎగురవేశారు.

● పిట్టలవానిపాలెం ఐలెండ్ సెంటర్‌లో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానేట్ సోపాటి, అంబేద్కర్ యువ కెరటాల ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పిట్టలవానిపాలెం టీడీపీ కార్యాలయంలో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానేట్ సోపాటి, టీడీపీనాయకులతో జాతీయజెండాను ఎగురవేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు లక్కంరాజు వెంకటపతిరాజు, మాజీ ఎంపీపీ బొలగాని వెంకటసులోచన నారాయణ, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కనుమూరి సాంబమూర్తిరాజు, జి.నరసరాజు, నాయకులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలలో గణతంత్ర వేడుకలను ఘనంగాజరుపుకున్నారు. కర్లపాలెం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యారం వనజ, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుందరమ్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కర్లపాలెం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నక్కా లలితాదేవి, కార్యదర్శి సునీత, జడ్పీటీసీ వేణుగోపాలరెడ్డితో కలిసి జెండా ఆవిష్కరించారు. కర్లపాలెం హైవెండ్ హైస్కూల్‌లో జాతీయ జెండాను మేనేజింగ్ డైరెక్టర్ సాయిమహేంద్రబాబు ఆవిష్కరించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కర్లపాలెంలో మహాత్మాగాంధీ,అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ యారం వనజ, జడ్పీటీసీ వేణుగోపాలరెడ్డి, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు

● వేమూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో గ్రామాల్లో ఆదివారం గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేమూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ సుశీల, పోలీస్‌స్టేషన్ వద్ద సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీరాంజనేయులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గాయత్రి, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని పద్మజ, ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద సీఐ రవి, 17 గ్రామాల్లోని పంచాయితీ కార్యాలయాల వద్ద ఆయా గ్రామాల సర్పంచ్‌లు, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ మోహనరావు జాతీయ జెండా ఎగురవేశారు. పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండారు సూరిబాబు, రజిని, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



వేమూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండా వందనం చేస్తున్న తహసీల్దార్ సుశీల, సిబ్బంది

● భట్టిప్రోలు, కొల్లూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర వేడుకలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. భట్టిప్రోలు, కొల్లూరు మండల పరిషత్, రెవెన్యూ, పంచాయతీ తదితర కార్యాలయాల్లో, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ జెండా ఆవిష్కరించి వందనం చేశారు. కొల్లూరులో దేశ నాయకుల స్థూపాల వద్ద పంచాయతీ కార్యదర్శి మల్లిఖార్జున జెండా ఆవిష్కరించి నాయకులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్లు డి.వెంకటేశ్వర్లు, ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవోలు కె.నరసింహారావు, ఎస్.వెంకటరమణ, అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించిన ఎంపీడీవో నరసింహారావు

● అమృతలూరు, జనవరి 26 : గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని పలు శాఖల అధికారులు జాతీయ జెండాలను ఆదివారం ఆవిష్కరించారు. అమృతలూరులోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కూచిపూడి నెహ్రూబాబు, మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ రావర్ల నరేంద్రకుమార్, ఎంపీడీవో మారుతీ శేషమాంబ, పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ అమర్‌వర్ధన్ జాతీయ జెండాలు ఆవిష్కరించారు.



చుండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ నాగరాజు

● చుండూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగరాజు జాతీయ జెండా ఆవిష్కరించగా, ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కుమారస్వామి, వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏవో ఆదాంబాబు, పోలీసుస్టేషన్ వద్ద సీఐ శ్రీనివాసరావు, విద్యాలయాల్లో హెచ్‌ఎంలు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి

● సీనియర్ సివిల్ జడ్జి టీ వెంకటేశ్వర్లు

రేపల్లె, జనవరి 26(ఆంధ్రజ్యోతి) : ప్రజలందరూ ఐక్యతతో ఉండి రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలని, జాతి సమైక్యతను కాపాడుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో ఆదివారం గణతంత్ర వేడుకలలో భాగంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పలువురు న్యాయవాదులు, బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.



కోర్టు ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రామలక్ష్మి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గాంధీజీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తితో ముందుకు వెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ జెండా ఎగురవేసి మాట్లాడుతున్న ఆర్డీవో రామలక్ష్మి

చైతన్య వేదిక ఆధ్వర్యంలో పట్టణంలో 200 మీటర్ల జాతీయజెండా ప్రదర్శించారు. మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ మాట్లాడుతూ ఎందరో ప్రాణత్యాగాల ఫలితంగా స్వాతంత్ర్యం ఏర్పడిందని వారి ఆశయాలను కొనసాగించే విధంగా ప్రజలు ముందుకు వెళ్ళాలని సూచించారు. కార్యక్రమంలో చైతన్య వేదిక అధ్యక్షుడు కొండపల్లి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు కొలసాని రాము, చెన్ను నాగమల్లేశ్వరరావు, దేవగిరి రవి, నాగశ్రీ, అమరనాథ్, జనసేన పార్టీ రేపల్లె సమన్వయకర్త మత్తి భాస్కరరావు, మల్లెల రామచంద్రరావు, వార్డెన్ ప్రసాద్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న అనగాని శివప్రసాద్, పలువురు ప్రముఖులు అధికారులు

మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రాజశేఖర్ జెండాను ఎగురవేసి మిఠాయిలను పంచిపెట్టారు.

మండలంలోని పిరాట్లంక గ్రామంలో జాతీయ జెండాను పంచాయతీ సర్పంచ్ కమతం రమాదేవి, జనసేన పార్టీ సీనియర్ నాయకుడు, కమతం ఫౌండేషన్ ట్రస్టీ కమతం సాంబశివరావు ఎగురవేసి మిఠాయిలను పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ భారతరాజ్యాంగం 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో తోట శ్రీమన్నారాయణ, మాజీ సర్పంచ్ రామ్మోహన్‌రావు, ప్రధాపాధ్యాయుడు కె.ప్రభాకరరావు, సుబ్బారావు, శివగంగాధరరావు, తమ్మా రత్తయ్య, కమతం బ్రాహ్మణయ్య, ప్రశాంతి, జ్యోతి, లావణ్య పాల్గొన్నారు.

● చెరుకుపల్లి, జనవరి 26(ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లిలోని ప్రభుత్వ కార్యాలయాలలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సీహెచ్ పద్మావతి పతాకావిష్కరణ చేసి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీటీ శాంతికుమారి, ఆర్ఐ మౌనిక, వీఆర్‌వోలు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు. చెరుకుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ టి.అనిల్‌కుమార్, చెరుకుపల్లి ఎంపీడీవో ఆఫీసులో ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ కృష్ణానాయక్, ఎంఈవో సురేష్‌బాబు, ఆఫీసు సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. చెరుకుపల్లి మండల ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ వారు గణతంత్ర వేడుకలు, అసోసియేషన్ 13వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.సుబ్బారావు పతాకావిష్కరణ చేశారు. రక్షణ దళాలలో సేవలందించిన సీనియర్లకు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరుంబాక ఎస్‌బీఐ ఫీల్డు ఆఫీసర్ బాలాజీ, న్యూటెక్ ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్ వెంకట్, మండలంలోని ఎక్స్‌సర్వీస్ మెన్‌లు పాల్గొన్నారు.

● నగరం, జనవరి 26(ఆంధ్రజ్యోతి) : నగరం మండలంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం, ప్రజా పరిషత్ కార్యాలయం, నగరం పోలీస్‌స్టేషన్, నగరం ఎక్సైజ్ స్టేషన్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి నివాళులర్పించారు. నగరం డిప్యూటీ తహసీల్దార్‌కు ప్రశంసాపత్రాన్ని కలెక్టర్ వద్ద నుంచి అందుకున్నారు. ఎస్వీఆర్ఎం కళాశాలలోను ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు జరిగాయి.

నాగరాజు సేవలు అభినందనీయం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

కర్లపాలెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల నియోజకవర్గ అభివృద్ధిలో గతంలో మంతెన నాగరాజు ప్రస్తుతం వారి మనవడు పెనుమెత్స నాగరాజు ఇప్పుడు నియోజకవర్గ అభివృద్ధిలో పలు ప్రాంతాలలో కీలక భూమిక పోషిస్తున్నారని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. కర్లపాలెం సెంటర్‌లో ఆధునీకరించిన బస్టాండ్‌ను ఎమ్మెల్యే నరేంద్రవర్మ, నాగరాజు (చినబాబు), ఆర్టీసీ డీఎం శిమన్నారాయణలతో కలిసి ప్రారంభించారు. అలాగే బస్టాండ్ ప్రాంగణంలో మంతెన నాగరాజు విగ్రహాన్ని ఆవిష్కరించారు. నరేంద్రవర్మ మాట్లాడుతూ చీరాల, రేపల్లె, బాపట్ల డిపో బస్సులన్నిటిని కర్లపాలెం బస్టాండ్‌లో ఆపే విధంగా చర్యలు చేపట్టాలని డిపో మేనేజర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో పెనుమెత్స సత్యనారాయణరాజు, పెనుమెత్స బాపిరాజు, బలరామరాజు, నాగవర్మ, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, సర్పంచ్ నక్కా లలితాదేవి, ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, ఎన్.వెంకటస్వామి, పిట్ల వసంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంతెన నాగరాజు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, చినబాబు (నాగరాజు) తదితరులు

ఘనంగా హజరత్ క్వాజగరీబ్ నవాజ్ గంధ మహోత్సవం

కొల్లూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) :హజరత్ క్వాజగరీబ్ నవాజ్ గంధ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాజస్థాన్‌లోని అజ్మీర్ షరీఫ్‌లో ఉన్న హజరత్ క్వాజగరీబ్ నవాజ్ రహంతుల్లా అలైహి పేరిట గంధ మహోత్సవం కొల్లూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా చెట్టు వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి జెండాను పురవీధుల్లో ఊరేగించి తిరిగి జెండా చెట్టు వద్ద ప్రతిష్ఠించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ముస్లింలతో పాటు హిందువులు పాల్గొని మత సామరస్యం చాటుకున్నారు.

ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి అవార్డులు





కలెక్టర్ వెంకట మురళి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జంపని ఆయుర్వేదిక్ శాఖ అధికారిణి శిరీష, వేమూరు ఎస్ఐ రవికృష్ణ

వేమూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా మండల పరిధిలోని ఇద్దరు అధికారులు ఆదివారం బెస్ట్ అవార్డులు అందుకున్నారు. ఆయుష్ విభాగం వేమూరు మండలం జంపని గ్రామానికి చెందిన ఆయుర్వేదిక్ శాఖ వైద్య అధికారిణి డాక్టర్ అవ్వారి శిరీష, వేమూరు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ఎస్ఐ రవికృష్ణలకు బాపట్లలో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో కలెక్టర్ చేతుల మీదుగా వాటిని బహూకరించారు. కార్యక్రమంలో ఎస్పీ తుషార్ డూడీ, ఆయుష్ విభాగానికి చెందిన రీజనల్ అధికారులు పాల్గొన్నారు. అవార్డులు పొందిన అధికారులకు ఆయా శాఖలకు చెందిన సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ ఏడీఈగా శ్రీనివాసరావు

కర్లపాలెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విద్యుత్‌శాఖలో వినియోగదారులకు మెరుగైన సేవలందించినందుకుగాను బాపట్ల ఏడీఈ తోటకూర శ్రీనివాసరావుకు కలెక్టర్ వెంకటమురళి ఉత్తమ అవార్డు, ప్రశంసపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు విద్యుత్‌శాఖాధికారులు అభినందనలు తెలిపారు.



కలెక్టర్ నుంచి ఉత్తమ ఏడీఈ అవార్డు అందుకుంటున్న తోటకూర శ్రీనివాసరావు

కొల్లూరు మండలంలో...

భట్టిప్రోలు, కొల్లూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయా ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బంది ఆదివారం కలెక్టర్, ఆయా శాఖల ఉన్నతాధికారుల నుంచి అవార్డులు అందుకున్నారు. కొల్లూరు మండల పరిధిలోని దోనేపూడి పశువైద్యశాలలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్‌గా పని చేస్తున్న వాగోలు శ్రీనివాసరావు, భట్టిప్రోలు మండలం చింతమోటు గ్రామానికి చెందిన శొంఠి శ్రీనివాసరావు రేపల్లెలో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్‌గా పని చేస్తూ ఉత్తమ సేవలు అందించారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్ కలెక్టర్ వెంకట మురళి, డీఆర్‌డీఏ డీడీ పద్మశ్రీ, లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి మల్లిపూడి శ్రీనివాసరావు, డాక్టర్ రజనీకుమారి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు.



పశు వైద్యశాఖలో ఉత్తమ సేవలు అందించిన శ్రీనివాసరావును సత్కరించి ప్రశంసా పత్రం అందించిన ఉన్నతాధికారులు



ప్రథమ బహుమతి పొందిన ఉద్యాన శాఖ స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి తదితరులు

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తెలియజెప్పేవిధంగా స్టాల్స్

● ఉద్యాన శాఖకు ప్రథమ, వ్యవసాయశాఖకు ద్వితీయ బహుమతి

బాపట్ల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తెలియజేస్తూ ఆయా శాఖల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున స్టాల్స్ ఏర్పాటు చేశారు. గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడి కలిసి పరిశీలించారు. వ్యవసాయశాఖ, ఉద్యాన శాఖ, గ్రామీణ నీటిసరఫరా, పారిశుధ్య శాఖ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాలశాఖ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, ఆయుష్‌శాఖ, చేనేత, జౌళీశాఖ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, శిక్షణాభివృద్ధి శాఖలు, పశుసంవర్ధకశాఖ, మత్స్య శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేశాయి. స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన వస్తువుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాగా ప్రదర్శించిన స్టాల్స్‌లో ఉద్యానవన శాఖ ప్రథమ బహుమతి, వ్యవసాయశాఖకు ద్వితీయ బహుమతి, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, మహిళా శిశు సంక్షేమశాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌కు తృతీయ బహుమతి లభించాయి. వీరికి కలెక్టర్ చేతుల మీదగా బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తుషార్ డూడి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా రెవెన్యూఅధికారి జి.గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మెప్మాలో అక్రమాలకు యాప్‌తో చెక్

● పొదుపు సంఘాల సమగ్ర వివరాలు నమోదు
● బయోమెట్రిక్ ముఖ హాజరు తప్పనిసరి

మెప్మాలో అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై వేటు వేసేందుకు రంగం సిద్ధమవుతోంది. బినామీ పేర్లతో సంఘాలను ఏర్పాటు చేసి రుణాలు కాజేయడం, పొదుపు నిధులను ఇష్టానుసారంగా అప్పు ఇవ్వడం వంటి మోసాలకు ఇకపై ఆస్కారం లేదు. ఎందుకంటే, ఎఫ్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌లో సభ్యుల సమగ్ర వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ యాప్‌లో ఒక్కో సభ్యురాలికి ఒక్కో గుర్తింపు సంఖ్యను ఇస్తారు.

సత్తెనపల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో అక్రమాలకు, బోగస్ సంఘాలకు ఇకపై చెక్ పడనుంది. అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై వేటు వేసేందుకు రంగం సిద్ధమవుతోంది. గత వైసీపీ పాలనలో పొదుపు సంఘాల స్ఫూర్తి దెబ్బతింది. సంఘాల పేరుతో అధికారులు, కొంత మంది నాయకులు విడుదలైన నగదును దిగమింగారు. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారంపై దృష్టి సారించింది. ప్రభుత్వ పథకాలకు అర్హులు ఎవరు? అనర్హులు ఎవరు? వారికి ఎంత లబ్ధి చేకూరింది? మొదలైన అంశాలను సర్వే ద్వారా సేకరించి కంప్యూటరీకరణ ద్వారా గుర్తిస్తున్నారు. ప్రతీ మహిళ లక్షాధికారి కావాలన్నది ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆకాంక్ష. ఈ మేరకు కార్యాచరణ మొదలైంది. పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లిలో 1102, వినుకొండలో 1286, పిడుగురాళ్ళలో 985, నరసరావుపేట 2,235, మాచర్ల 1059, గురజాల 560, దాచేపల్లి 218, చిలకలూరిపేటలో 2,295 పొదుపు సంఘాలు ఉన్నాయి. పొదుపు సంఘాల సభ్యులు నెలవారీ సమావేశాలు నిర్వహిస్తుంటారు. అయితే, ఈ సమావేశాలకు రాకుండా వచ్చినట్టు నమోదు చేయటం, మృతులను సభ్యులుగా కొనసాగించడం, బినామీ పేర్లతో సంఘాలను ఏర్పాటు చేసి రుణాలు కాజేయడం, పొదుపు నిధులను ఇష్టానుసారంగా అప్పు ఇవ్వడం వంటి అనేక రకాల మోసాలు జరుగుతున్నాయి. ఇకపై వీటన్నింటికీ చెక్ పడనుంది. నెల వారి సమావేశాలకు బయోమెట్రిక్ ఆధారిత ముఖ హాజరు తప్పనిసరి కానుంది.

ప్రత్యేక యాప్ రూప కల్పన

పొదుపు సంఘాల్లో ప్రతి సభ్యురాలి వివరాలు వెంటనే తెలుసుకునేలా మెప్మా ఎఫ్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌లో పొదుపు సంఘాల సమగ్ర వివరాలు నమోదు చేస్తున్నారు. సభ్యుల ఆధార్‌తో అనుసంధానమైన పేర్లు, సంఘాల్లో వారు చేరిన తేదీ, విద్యార్హత, కులం, పిల్లలు, వైకల్యం, గ్యాస్ కనెక్షన్, ప్రభుత్వ పథకాల్లో ఎంత మంది లబ్ధి పొందారు? ఎవరికి రాలేదు, బ్యాంక్ నుంచి తీసుకున్న రుణాలు, జీవనోపాధి, వృత్తి పరమైన నైపుణ్యం, నెలసరి ఆదాయం, వ్యక్తిగత పొదుపు వివరాలు నమోదు చేస్తున్నారు. అలాగే, సంఘం సభ్యురాలి కుటుంబంలోని వ్యక్తుల విద్యార్హతలు, పారిశ్రామికంగా అభివృద్ధికి ఉన్న అవకాశాలు, సూక్ష్మ, మధ్య తరహా, పరిశ్రమల కోసం రుణాల ఆవశ్యకత, కుటుంబసభ్యుల్లో నిష్ణాతులు ఉంటే ఆ వివరాలు కూడా యాప్‌లో నమోదు చేస్తారు. అంతేగాక పొదుపు రుణాలు, వడ్డీ చెల్లింపులు, మాఫీలు, నెలవారి సమావేశాలు అప్‌లోడ్ చేస్తున్నారు. రుణాల చెల్లింపుల్లో సక్రమంగా ఉన్న గ్రూపులకు ప్రాధాన్యత ఇస్తారు. ఇందు కోసం మెప్మా కోర్ బ్యాంకింగ్ వ్యవస్థను అందుబాటులోకి తేనుంది. సభ్యుల వ్యక్తిగత ఖాతాలకే నగదు జమ చేయడం ద్వారా మామూళ్ళ బెడద కూడా ఉండదు. ఈ యాప్‌లో ఒక్కో సభ్యురాలికి ఒక్కో గుర్తింపు సంఖ్యను ఇస్తారు.



ఆర్థిక స్వావలంబనకు అవకాశం

సర్వే ద్వారా యాప్‌లో పొదుపు సంఘాలు, సభ్యుల సంపూర్ణ వివరాలు నమోదువుతాయి. క్రమబద్ధమైన సమావేశాలు, పొదుపు, అంతర్గత అప్పులు, చెల్లింపులు, పుస్తక నిర్వహణతో సంఘాల బలోపేతంతో పాటు ఆర్థిక స్వావలంబనకు అవకాశం ఉంటుంది. ఎలాంటి అక్రమాలకు అవకాశం ఉండదు.

- షేక్ ఖాజా, మెప్మా టౌన్ మిషన్ కోఆర్డినేటర్(టీఎంసీ), సత్తెనపల్లి

బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం చేస్తాం

● అగ్నిప్రమాద బాధితులకు మంత్రి మనోహర్ భరోసా



ఐసీయూలో బాధితుడిని పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

గుంటూరు మెడికల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో కాలిన గాయాలతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చేరిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందిస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. 24వ తేదీ శుక్రవారం రాత్రి ఏలూరు జిల్లా మండవల్లి మండలం శోభనాద్రిపురంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో 14 మంది గాయపడగా, అందులో ఏడుమందిని మెరుగైన వైద్యసేవల కోసం గుంటూరు జీజీహెచ్‌లో చేర్పించారు. మిగిలిన వారు ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలో మూడు సంవత్సరాల బాలుడు మృతి చెందాడు. గుంటూరు జీజీహెచ్‌లో 80 శాతం గాయాలతో ఐసీయూలో చికిత్స పొందుతున్న ఇద్దరి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మిగిలిన నలుగురికి 50 నుంచి 60 శాతం గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏడుగురు బాధితులను ఆదివారం మంత్రి మనోహర్ పరామర్శించారు. వీరి పరిస్థితిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నష్టపరిహారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గుంటూరు జీజీహెచ్‌లో బర్నింగ్ వార్డు లేకపోవడం లోటుగా ఉందని, బర్నింగ్ వార్డు ఏర్పాటు ఆవశ్యకత ఉందని ఆయన తెలిపారు. ప్రభుత్వ సమగ్రాస్పత్రి అభివృద్ధి సంఘం సమావేశంలో ప్రజాప్రతినిధులు ఈ విషయమై చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటారని మంత్రి మనోహర్ తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వి రమణ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఉప్పాల శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మీ, జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వివా పాఠశాల వార్షికోత్సవం

పెదకాకాని, జనవరి 26(ఆంధ్రజ్యోతి): వివా ది స్కూల్ తొమ్మిదవ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇండియన్ ఆర్మీ మేజర్ వెంకటేష్ శర్మ, వివా వీవీఐటీ



చిన్నారులకు బహుమతి ప్రదానం చేస్తున్న వీవీఐటీ చైర్మన్ విద్యాసాగర్

విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ హాజరయ్యారు. విద్యార్థులకు క్రీడ, సాంస్కృతిక అంశాలలో పోటీలు నిర్వహించి ప్రశంసా పత్రాలను అందించారు. అనంతరం వేడుకలను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ ప్రారంభించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక, శాస్త్రీయ, ఆధునిక నృత్యాలు, గీతాలు విశేషంగా అలరించాయి. విద్యార్థులు జై జవాన్ జై కిసాన్ అంటూ ప్రదర్శించిన నృత్యం, "భువన విజయం" నాటిక ఆకట్టుకున్నాయి. మేజర్ వెంకటేష్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టమైన రంగాన్ని లక్ష్యంగా ఎంచుకుంటే విజయం తప్పకుండా వరిస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో వివా డైరెక్టర్ లెఫ్టినెంట్ కమాండర్ కె.ఎస్.రావు,ప్రిన్సిపాల్ చదలవాడ సరళ,గుంటూరు క్యాంపస్ హెడ్ మామిళ్లపల్లి వేదవాణి, ఐబీ ప్రోగ్రాం సంధానకర్త కె. మాధవి, సీబీఎస్ఈ సంధానకర్త జ్యోతి మెటిల్డా, సీనియర్ సెకండరీ సంధానకర్త లక్ష్మీభాస్కర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వివా వీవీఐటీలో ఘనంగా గణతంత్ర వేడుకలు


పెదకాకాని, జనవరి 26(ఆంధ్రజ్యోతి): వివా ది స్కూల్, వీవీఐటీ నందు 76వ గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 25 ఆంధ్ర బెటాలియన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ దీపక్ శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని



గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న విద్యాసాగర్ తదితరులు

జెండాను ఆవిష్కరించారు. అనంతరం పాఠశాలలోని వీవీఐటీ, వివా ఎన్.సి.సి. విద్యార్థులచే గౌరవ వందనం స్వీకరించారు. లెఫ్టినెంట్ కల్నల్ దీపక్ శర్మ మాట్లాడుతూ నీతి, నిజాయతీ, ఐకమత్యంతో మెలగడం దేశ పౌరులుగా మనందరి బాధ్యత అని అన్నారు. దేశ అభ్యున్నతిలో విద్యార్థుల భాగస్వామ్యం ఉండాలని, ఏదేశం వెళ్లినా స్వదేశానికి సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివా వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వీవీఐటీ ప్రిన్సిపాల్ డా.వై. మల్లికార్జునరెడ్డి , వివా డైరెక్టర్ లెఫ్టినెంట్ కమాండర్ కె.ఎస్. రావు, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, ఎన్.ఎస్. ఎస్. ఆఫీసర్స్ సయ్యద్ బిబున్ భాషా, ఎ. శ్రీవాణి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారులకి ఉత్తమ సేవా ప్రశంసాపత్రాలు



కలెక్టర్ నుంచి ఉత్తమసేవా ప్రశంసాపత్రం అందుకుంటున్న వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ రాజకుమారి

గుంటూరు సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే వేడుకలను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ప్రకటించిన ఉత్తమసేవా పురస్కారాలలో వ్యవసాయ శాఖ పంట పడింది. జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు ఉత్తమ సేవా ప్రశంసాపత్రం అందుకున్నారు. ప్రకృతి వ్యవసాయంలో నూతన ఒరవడి సృష్టించిన ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ రాజకుమారి కూడా ఉత్తమ సేవా ప్రశంసాపత్రం అందుకున్నారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా ఇరువురు అధికారులు ఉత్తమ సేవా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. డ్వామా కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కావూరి సాల్మన్ రాజు కూడా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమసేవా ప్రశంసాపత్రం అందుకున్నారు. మెప్మాలో సీఓగా పనిచేస్తున్న సయ్యద్ అహ్మద్ మునిసిపల్ కమిషనర్ చేతుల మీద గా ఉత్తమ సేవా ప్రశంసాపత్రం అందుకున్నారు.

మన రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శం

● శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు

గుంటూరు(విద్య)జనవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతిపెద్ద జనాభా, విభిన్న జాతులు, కులాలు, సంస్కృతులు ఉన్న భారతదేశానికి ఆవిర్భవించిన భారత పార్లమెంటరీ రాజ్యాంగం ఉత్కృష్టమైనదని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు కె మోషేన్ రాజు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక విజ్ఞాన మందిరంలో కె.వి.ఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపొందించిన భారత రాజ్యంగం పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. కె మోషేన్‌రాజు మాట్లాడుతూ దేశం గణతంత్ర వజ్రోత్సవ దినోత్సవం జరుపుకుంటున్న నేపథ్యంలో భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న మనదేశంలో మతాల కులాల మధ్య విభేదాలు సృష్టిస్తూ రాజకీయ లబ్ధి కోసం జాతీయ స్థాయిలో కుట్రలు జరుగుతున్నాయని, తద్వారా లౌకికవాదానికి ముప్పు ఏర్పడే అవకాశాలు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమం నిర్వాహకులు, శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ మైనారిటీ అల్ప సంఖ్యాక వర్గాల ప్రజలపై ఆర్థిక సామాజిక సాంస్కృతిక దోపిడీ తోపాటు వారిపై సనాతన వాదాన్ని బలంగా రుద్దే అవకాశాలు కనిపిస్తున్నాయన్నారు. ప్రజలు ప్రజాస్వామ్య వాదులు, ముక్తకంఠంతో కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణలను ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడుతున్న ప్రతిసారి న్యాయవ్యవస్థ ప్రజల పక్షంగా బలంగా పని చేస్తూ రాజ్యాంగ పరిరక్షణ చేస్తున్నదన్నారు.



భారత రాజ్యంగ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు తదితరులు

కార్యక్రమంలో కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్ట్ కార్యదర్శి కె. అలిన్, కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ డాక్టర్ వీ నారాయణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర రావు, రాజ్యాంగ చర్చా వేదిక అవధానుల హరి, జన చైతన్య వేదిక అధ్యక్షులు వీ లక్ష్మణరెడ్డి, ఆవాజ్ నాయకులు చిష్టి, విశ్లేషకులు బీ మల్లికార్జునరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విజిఎస్ పబ్లిషర్స్ ద్వారా ప్రచురితమైన "భారత రాజ్యాంగం" (సంక్షిప్తంగా) పుస్తకాన్ని శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు, "రాజ్యాంగ నిర్మాణం -రాజ్యాంగ పీఠిక" పుస్తకాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవితం అనే పుస్తకాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాస రావు, భారత రాజ్యాంగం ముఖ్యాం శాలు పుస్తకాన్ని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, సమకాలీన వ్యాసాలు పుస్త కాన్ని రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి తదితరుల చేత ఆవిష్కరింపచేశారు.

నల్ల చట్టాలను దొడ్డిదారిన అమలు చేయాలని ప్రయత్నిస్తున్న కేంద్రం

● రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీ కృష్ణయ్య

నరసరావుపేట టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో కేంద్ర ప్రభు త్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా 13 నెలలు పాటు రైతులు, కార్మికులు పోరాటం చేస్తే దిగివచ్చి క్షమాపణ చెప్పి చట్టాలను వెనక్కి తీసుకుంటామని చెప్పిందని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీ కృష్ణయ్య అన్నారు. ఆదివారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ



ర్యాలీలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీ కృష్ణయ్య, ఏపూరి గోపాలరావు తదితరులు

జాతీయ అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల పిలుపు మేరకు నరసరావుపేట పట్టణంలో మార్కెట్ యార్డు నుంచి ట్రాక్టర్, బైక్‌లతో భారీ ర్యాలీ ప్రధాన వీదుల నుంచి గాంధీపార్కు వరకు నిర్వహించారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూడి గోపాలరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు డీ కృష్ణయ్య మాట్లాడు తూ అవే చట్టాలను కేంద్రం అమలుచేయాలని చూస్తుందన్నారు. దీనివల్ల వ్యవసాయంపై ఆధార పడిన రైతుల పరిస్థితి ప్రమాదంలో పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పంటలకు స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం గిట్టుబాటు ధరలు చట్టం చేయాలని, కేరళ తరహా రుణ విమోచన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయాలని 57 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న జగజీత్ సింగ్ దల్లేవాల్‌కు ఏమైనా జరిగితే కేంద్రప్రభుత్వం బాధ్యత వహిం చాల్సి ఉంటుందన్నారు. ఉలవలపూడి రాము, ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రెడ్ బాషా, కార్మిక సంఘాల నాయకులు ఎస్ ఆంజనేయనాయక్, కాసా రాంబాబు, సీఐటీయూ శ్రామిక మహిళాసంఘం డీ శివకుమారి, కిసాన్ మహాసభ తోట ఆంజనేయులు, పీకేఎస్ కొండలు, పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ జాతీయ జెండా ఎగురవేసారు. పోలీస్ కార్యాలయ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా అవతరించి నేటికి 75 ఏళ్లు పూర్తై 76వ ఏటలో అడుగుపెడుతున్న సందర్భంగా గణతంత్ర వేడుకలను జరుపుకుంటున్నామన్నారు. మన దేశం యొక్క గొప్ప చరిత్రకు ప్రజాస్వామ్య సూత్రాలు, నిబద్ధతకు నిదర్శనం గణతంత్ర దినోత్సవం అన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అదనపు ఎస్పీ జీవీ రమణమూర్తి, ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, పోలీస్ కార్యాలయ ఏవో అద్దంకి వెంకటేశ్వరరావు, ఎస్బీ డీఎస్పీ సీతారామయ్య, ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలు రెడ్డి, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

ఎస్ఆర్ఎంలో క్రీడాకారులకు రూ.70 లక్షల నగదు ప్రోత్సాహకాలు

మంగళగిరి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఉద్యోగులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. యూనివర్సిటీ ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా భారత్ తరపున పారిస్ ఒలింపిక్స్‌కు హాజరైన వర్సిటీ విద్యార్థిని దండి జ్యోతికశ్రీ(రన్నర్)కు యాజమాన్యం రూ.20 లక్షల నగదు ప్రోత్సాహకం అందజేసింది. వివిధ క్రీడాంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి స్వర్ణ, రజత, కాంస్య పతకాలను కైవసం చేసుకున్న క్రీడాకారులకు క్యాష్ అవార్డులను అందజేశారు. కుంజా రజితకు రూ.2 లక్షలు, రంగోలి స్వాతికి రూ.లక్ష, ముగదా శిరీషకు రూ.2.30 లక్షలు, బ్యాడ్మింటన్ క్రీడాకారులు సుమైర్ షేక్‌కు రూ.లక్ష చొప్పున మొత్తం రూ.70 లక్షల విలువైన నగదు ప్రోత్సాహకాలను క్రీడాకారులకు అందించారు. ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఎస్ఆర్ఎం ఉద్యోగులు డాక్టర్ అరుంధతి, రేవతి బాలకృష్ణన్, లావణ్య, శంకర నారాయణలకు ప్రసంసా పత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్య క్రమంలో ఎస్ఆర్ఎం రిజిస్ట్రార్ ప్రేమ్‌కుమార్, డీన్‌లు భరద్వాజ్, విష్ణుపథ్, సీవీ టామీ, డైరెక్టర్లు అనూప్‌సింగ్, పంకజ్ బల్వేరియా, అనిల్ నిగమ్, రేవతి, సుస్మిత, శివరంగన్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతికశ్రీకి రూ.20 లక్షల చెక్కును అందజేస్తున్న ఎస్ఆర్ఎం ప్రతినిధులు

డాక్టర్ నరేష్‌బాబుకు జాతీయ అవార్డు

● ఏఎస్ఎస్ఐ స్పైన్ క్లినిక్ రీసెర్చ్ అవార్డ్ కైవశం
● తెలుగు రాష్ట్రాల్లో ఈ అవార్డు సాధించడం ఇదే తొలిసారి

గుంటూరు మెడికల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన ప్రముఖ వెన్నెముక వైద్యనిపుణులు జే నరేష్‌బాబు అసోసియేషన్ ఆఫ్ స్పైన్స్ సర్జన్స్ ఆఫ్ ఇండియా (ఏఎస్ఎస్ఐ) అందజేసే



నరేష్‌బాబుకు అవార్డు అందజేస్తున్న సౌమ్యజిత్, రూపేందర్ సింగ్

బెస్ట్ స్పైన్ క్లినికల్ రీసెర్చ్ అవార్డ్ 2024 గెలుచుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఆర్థోపెడిక్ వైద్య రంగంలో పరిశోధనకు స్పైన్ క్లినికల్ రీసెర్చ్ అవార్డు దక్కడం ఇదే తొలిసారి. సర్వైకల్ స్పాండిలోసిస్ వ్యాధి అంతిమ దశలో రోగులు చేతిలో తిమ్మిర్లు, బ్యాలెన్స్ కోల్పోవడం, ఎత్తు పల్లాల్లో నడవ లేకపోవడం, కళ్లు మూసుకుంటే తూలుడు వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని సార్లు ఇవి పక్షవాత లక్షణాలను పోలి ఉంటాయి. ఈ అంశంపై డాక్టర్ నరేష్‌బాబు గుంటూరు మల్లిక స్పైన్ సెంటర్‌లో ఏడాది పాటు 100 మంది రోగులపై పరిశోధన జరిపారు. రోగులు కూర్చున్న భంగిమలో ఎంఆర్ స్కానింగ్ తీస్తే మెడ నరాల్లో సీ4, సీ5 వద్ద నరాలపై ఒత్తిడి పడుతున్నట్లు తేలింది. రోగులు పడుకున్న భంగిమలో ఎంఆర్ఐ తీస్తే సీ3, సీ4 మెడ నరాలపై ఒత్తిడి పెరుగుతున్నట్లు గుర్తించారు. సర్వైకల్ స్పాండిలోసిస్ వ్యాధి నిర్ధారణలో ఇది కొత్త అంశం. సీ3, సీ4 ఆధారంగా వ్యాధి తీవ్రతను ముందుగానే గుర్తించవచ్చు. ఈ అంశంపై డాక్టర్ నరేష్ బాబు సమర్పించిన పరిశోధన పత్రానికి ఏఎస్ఎస్ఐ జాతీయ సదస్సులో ప్రథమ బహుమతి లభించింది. గత వారం బెంగళూరులో జరిగిన అసోసియేషన్ వార్షిక సమావేశంలో సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సౌమ్యజిత్ బసు, కార్యదర్శి రూపేందర్ సింగ్ చాహల్ ఈ అవార్డును డాక్టర్ నరేష్‌బాబుకు ప్రదానం చేశారు. అవార్డు కింద మెడల్, రూ25 వేలు నగదు బహుమతిని అందజేశారు.

జాతీయ కార్యదర్శిగా ఎంపిక...

అసోసియేషన్ ఆఫ్ స్పైన్స్ సర్జన్స్ ఆఫ్ ఇండియా (ఏఎస్ఎస్ఐ) జాతీయ కార్యదర్శిగా డాక్టర్ నరేష్‌బాబు ఎంపికయ్యారు. 2027-29 సంవత్సరాలల్లో ఆయన జాతీయ కార్యదర్శిగా కొనసాగుతారు. ప్రస్తుతం డాక్టర్ నరేష్ బాబు సంఘం జాతీయ జాయింట్ సెక్రటరీగా వ్యవహరిస్తున్నారు.

ఎండో వ్యాస్క్యులర్ సర్జరీలతో రోగులకు ఉపశమనం

● డాక్టర్ విజయ్‌కుమార్ విష్ణుమొలక వెల్లడి

గుంటూరు (మెడికల్) జనవరి 26: ఎండో వ్యాస్క్యులర్ సర్జరీల్లో స్టెంట్లు, గ్రాఫ్ట్లు, ఎంబలైజేషన్ వంటి ప్రక్రియలు నిరంతరం పురోగమిస్తూ మెరుగైన ఫలితాలను రాబట్టేందుకు దోహదపడుతున్నట్లు ఎండోవ్యాస్క్యులర్ సర్జన్ డాక్టర్ విజయ్ కుమార్ విష్ణుమొలకల తెలిపారు.



జ్యోతి ప్రజ్వలనతో సీఎంఈను ప్రారంభిస్తున్న డాక్టర్ సంజయ్ తదితరులు

ఆదివారం గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో జరిగిన ఎండోవ్యాస్క్యులర్స్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జరిగిన నిరంతర వైద్య విద్య కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గుండె, రక్తనాళాల వ్యాధుల వైద్య రంగంలో ఆధునికంగా చోటు చేసుకుంటున్న అధునాతన వైద్య ప్రక్రియలు, నూతన వైద్య పరిజ్ఞానం గురించి సీఎంఈ కార్యక్రమాల ద్వారా వైద్యులు తెలుసుకోవచ్చని డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. డాక్టర్ సురేష్ రెడ్డి తుపాకుల మాట్లాడుతూ సంక్లిష్టమైన గుండె, రక్తనాళాల వ్యాధుల చికిత్సల్లో రోగి ప్రయోజనాలను గరిష్టస్థాయికి చేర్చేందుకు, ప్రమాదాలను తగ్గించేందుకు ఎండో వ్యాస్క్యులర్ సర్జరీలు ఎంతగానో ఉపయోగపడుతున్నట్లు తెలిపారు. డాక్టర్ సురేంద్ర నాగలపాటి, పెరిఫెరల్ వ్యాస్క్యులర్ డిసీజ్ గురించి, వాటి చికిత్సల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాస్క్యులర్ సర్జన్లు డాక్టర్ సంజయ్ సి దేశాయ్, డాక్టర్ ఆర్ చంద్రశేఖర్, డాక్టర్ తాపీష్ సాహు, డాక్టర్ దివాకర్, డాక్టర్ హర్షతో పాటు 300 మంది వైద్యులు పాల్గొన్నారు.



వైసీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయండి

ఎమ్మెల్యే కొండయ్య

చీరాలటౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గ అభివృద్ధికి టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాటుపడాలని, సమిష్టిగా సమన్వయంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. వైసీపీకి చెందిన పోలీస్ హౌసింగ్ బోర్డు మాజీ డైరెక్టర్ మల్లి వైష్ణవి, రామనగర్‌కు చెందిన వైసీపీ నాయకులు సుమారు 50 కుటుంబాలతో కలిసి ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈమేరకు నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కొండయ్య వారికి పార్టీ కండువాలు వేసి స్వాగతించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చీరాల ప్రాంత అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. పలువురు టీడీపీ కూటమి నాయకులు కార్యకర్తలు, పార్టీ శ్రేణులు ఉన్నారు.

మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డుపై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ప్రతినిధులు

చీరాలటౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మంద కృష్ణమాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడంపై ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈక్రమంలో చీరాల మండల పరిధిలోని విజయనగర్ కాలనీలో శనివారం రాత్రి బాణా సంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ సామాజిక ఉద్యమాల్లో పాల్గొంటూ మాదిగల ఆత్మ గౌరవానికి పునాది వేసినట్లు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య, వందనం, వెంకటేశ్వర్లు, లైమన్, రవి, వంశీ, చింటూ, క్రాంతి, ముసలయ్య, మధు, మోహన్, యోహాన్, రవీంద్ర, వేణు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ ప్రకటించిన సందర్భంగా ఆదివారం అద్దంకిలో ఎంఈఎఫ్, ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు బంగ్లా రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు అనపర్తి రమేష్, ప్రధాన కార్యదర్శి గంగవరపు సిద్ధు, దాసరి మోషే, మల్లవరపు దేవదాసు, అన్నమయ్య, పూనూరి నరేంద్ర, చక్రవర్తి, బుల్లయ్య, ఆంటోని తదితరులు పాల్గొన్నారు

అన్నదాన సత్రం అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న అన్నదాన సత్రం అధ్యక్షుడు కనకరత్నాచారి

అద్దంకి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండలోని విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో కృషి చేస్తానని అధ్యక్షుడు దంతనాల కనకరత్నాచారి అన్నారు. ఇటీవల నూతన కమిటీ ఎన్నిక జరగ్గా, ఆదివారం శింగరకొండ లోని సత్రంలో తొలి సమావేశం జరిగింది. మార్చి 14న జరిగే శింగరకొండ వార్షిక తిరునాళ్లకు సత్రంలో మరింత విస్తృత స్థాయిలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటుపై చర్చించారు. సమావేశంలో మాజీ అధ్యక్షుడు దాచేపల్లి ఆంజనేయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐటీసీ కార్మికుడికి గాయాలు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఐటీసీ కార్మికుడికి గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం మండల పరిధిలోని బోయినవారి పాలెంకు చెందిన ఐటీసీ కార్మికుడు విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా ఎదురుగా మరో ద్విచక్ర వాహనంపై వస్తున్న యువకులు ఈపూరుపాలెం ప్రధాన రహదారిలో వేగంగా ఢీకొట్టారు. సమాచారం అందుకున్న ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలించి వివరాలు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యాశాఖకు అవమానం

- డీఈవో నిర్వాకంతో ఒక్కరికీ దక్కని ప్రశంసాపత్రం
- వివరాలు కలెక్టర్‌కు పంపకపోవడమే కారణం

ఒంగోలు విద్య, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖకు తీవ్ర అవమానం జరిగింది. గణతంత్ర వేడుకల్లో ఆశాఖకు గుర్తింపు లేకుండా పోయింది. డీఈవో కిరణ్‌కుమార్ నిర్వాకంతో విద్యాశాఖ అధికారులు, సిబ్బందిలో ఒక్కరంటే ఒక్కరికి కూడా కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా ఉత్తమ సేవా పతకం అందుకునే అవకాశం దక్కలేదు. గణతంత్ర, స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా అధికారులు, సిబ్బందికి ఉత్తమ సేవా పతకాలు అందించేందుకు సంబంధిత శాఖల జిల్లా అధికారులను కలెక్టరేట్ నుంచి వివరాలు కోరుతారు. ఈసారి కూడా అలాగే అడిగారు. అయితే డీఈవో ఆ వివరాలను కలెక్టరేట్‌కు పంపలేదని తెలిసింది. ప్రభుత్వ శాఖల్లో రెవెన్యూ, పోలీసు, వైద్యారోగ్య, విద్యాశాఖలు పెద్దవి. జిల్లాలో 85 ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న 512 మందికి అవార్డులు లభించాయి. పట్టుమని పది మంది ఉద్యోగులు లేని శాఖలోని వారు కూడా ప్రశంసాపత్రాలు తీసుకున్నారు. వేలాది మంది పనిచేస్తున్న విద్యాశాఖలో మాత్రం ఒక్కరికి కూడా దక్కకపోవడం శోచనీయం. గతంలో ఎంఈవోలు, హెచ్‌ఎంలు, టీచర్లు, కేజీబీలు, సమగ్ర శిక్ష తదితర విభాగాల్లో పనిచేస్తున్న వారికి అవార్డులు ఇచ్చేవారు. ఈసారి డీఈవో కిరణ్‌కుమార్ ఎవ్వరి పేర్లు సిఫార్సు చేయకపోవడంతో ఒక్కరికి కూడా అవార్డు దక్కలేదు. ఈవిషయమై డీఈవోను వివరణ కోరగా తాను కొత్తగా బాధ్యతలు స్వీకరించినందున అవార్డులకు పేర్లు సిఫార్సు చేస్తూ వివరాలు పంపలేకపోయానని చెప్పారు.

భక్తులకు అన్నదానం

సీఎస్‌పురం (పామూరు), జనవరి 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అరటి ఆకుల్లో అన్నదానం నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థాన రాజగోపురం నుంచి స్వామివార్లకు మంగళ వాయిద్యాలతో మహా నైవేద్యాన్ని సమర్పించి భక్తులకు పంచిపెట్టారు.

ఉపాధి నిధుల దుర్వినియోగంపై కదిలిన డొంక

- చినకొత్తపల్లిలో నిర్మించిన సీసీ రోడ్లు
- చెక్ రూపేణా చెల్లించాల్సినది రూ.15.74లక్షలు
- నేరుగా డ్రా చేసిన పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లు
- జిల్లా అధికారులకు చేరిన డీఎల్‌పీవో విచారణ నివేదిక
- కార్యదర్శి, సర్పంచ్‌కు షోకాజ్ నోటీసులు

అద్దంకి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులో వైసీపీ ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరించి ఆలస్యంగా విడుల చేశారు. తీరా నిధులు విడుదలైన తరువాత కూడా అద్దంకి మండలంలోని చినకొత్తపల్లిలో మాత్రం టీడీపీ నాయకుడు చేసిన పనులకు సంబంధించిన పనులకు విడుదలైన నిధులను సదరు నేతకు చెల్లించకుండా ఏకంగా వైసీపీ వర్గానికి చెందిన సర్పంచ్ గుజ్జుల మల్లికరెడ్డి, అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డి కలిసి సర్పంచ్ సోదరుడు, వైసీపీ నేత చంద్రగిరి వీరారెడ్డి పనులు చేసినట్లు ఫోర్జరీ పత్రాలను సృష్టించి బిల్లులు చెల్లింపులు చేసిన సంఘటన పై అధికారుల విచారణతో అవినీతి డొంక కదిలింది.



చినకొత్తపల్లిలో ఉపాధి నిధులతో గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో నిర్మించిన సీసీ రోడ్డు

అద్దంకి మండలం చినకొత్తపల్లి పంచాయతీ పరిధిలోని చినకొత్తపల్లి, శ్రీనివాసనగర్‌లో 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.50 లక్షలతో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌ల నిర్మాణం జరిగింది. ఈ పనులకు సంబంధించి టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్ 30 శాతం మెటీరియల్ కాంపొనెంట్ కింద రూ.15,74,283 విలువైన సామగ్రి సరఫరా చేశారు. అందుకు సంబంధించి 2021 సెప్టెంబరు 3వ తేదీ రూ.15,74,283 ప్రభుత్వం నుంచి విడుదల అయ్యాయి. ఈ నిధులను టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్‌కు చెల్లించకుండా అప్పటి పంచాయతీ కార్యదర్శి (ప్రస్తుతం సంతమాగులూరు మండలం పాతమాగులూరు పంచాయతీ కార్యదర్శి) ఈశ్వరరెడ్డి, సర్పంచ్ మల్లికరెడ్డి నేరుగా డ్రా చేశారు. ఈ నగదును సర్పంచ్ సోదరుడు చంద్రగిరి వీరారెడ్డి కి చెల్లించారని మానం మురళీమోహన్‌దాస్ ఒక వైపు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తునే మరో వైపు న్యాయస్థానాల ద్వారా పోరాటం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మరో సారి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో చీరాల డీఎల్‌పీవో డిసెంబరు 18వ తేదీ శివనారాయణ విచారణ చేపట్టారు. విచారణలో సర్పంచ్ గుజ్జుల మల్లికరెడ్డి, అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డి బ్యాంక్ నుంచి నేరుగా డబ్బులు డ్రా చేసినట్లు గుర్తించి జిల్లా అధికారులకు నివేదిక అందజేశారు. నిధులు దుర్వినియోగానికి పాల్పడడంతో విధుల పట్ల బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించినందున శాఖాపరమైన చర్యలు ఎందుకు తీసుకోరాదో నోటీస్ అందిన 10 రోజులలో సమాధానం ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ షోకాజ్ నోటీస్‌లు జారీ చేశారు.

ఘనంగా ఎమ్మెల్యే ఏలూరి జన్మదినోత్సవం



అనంతవరంలో కేక్‌ను కట్ చేస్తున్న, వెంకయ్య ఆశ్రమంలో పేదలకు వస్త్రాలను పంపిణీ చేస్తున్న తెలుగు యువత నాయకుడు షేక్ ఫరూక్, ఇంకొల్లులో కేక్ కట్ చేస్తున్న నాయకులు

యద్దనపూడి, (మార్టూరు) జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు జన్మదిన వేడుకలను ఆదివారం యద్దనపూడి మండలంలోని పలు గ్రామాలలో పార్టీనాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. మండలంలోని అనంతవరం గ్రామంలో నాయకులు కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో గుదే తారకరామారావు, కొరటాల వంశీకృష్ణ, కె.మోహనరావు, పెడవల్లి సాంబశివరావు, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, ఆచంటి సుబ్బారావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. పూనూరులో శనివారం అర్ధరాత్రి కేక్‌కట్ చేసి ఏలూరికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బోయపాటి సాంబశివరావు, ఈదల అనిల్‌కుమార్, సుధాకర్ బాబు, మారుతీవినయ్,షేక్ నాగూర్‌వలి, చందనాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. మార్టూరు మండలంలోని పలుగ్రామాలలో ఏలూరి పుట్టినరోజు వేడుకలను కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మార్టూరులో వెంకయ్య ఆశ్రమంలో మాజీ ఉపసర్పంచ్ షేక్ ఫరూక్ పేదలకు, వృద్ధులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. వలపర్లకు చెందిన నాయకులు కంభంపాటి హనుమంతరావు, జీ శంకర్, బూరగవీరయ్య, వేణు, రమేష్, శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, మణి ఏలూరి క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఏలూరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. యలగా రామాంజనేయులు ఆధ్వర్యంలో వెంకటేశ్వర్లు, సుబ్బారావు, సర్పంచ్ బ్రహ్మయ్య శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని పలుగ్రామాలకు చెందిన నాయకులు ఏలూరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాగరాజుపల్లి గ్రామానికి చెందిన మిన్నెకంటి రవికుమార్, పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం అర్ధరాత్రి క్యాంపు కార్యాలయంలో కామినేని జనార్దన్, షేక్ అబ్దుల్ రజాక్ ఏలూరిని కలిసి శుభాకాంక్షలను తెలిపారు. తూర్పుబజారున కమ్మ శివనాగేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఏలూరికి జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరికి మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్ ఆధ్వర్యంలో సభ్యులు పూల మొక్కను ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రానైట్ పరిశ్రమ యజమానులు ఇంటూరి ఆంజనేయులు, దేవినేని శ్రీనివాసరావు, కొర్రపాటి వేణు, ప్రసాద్, కృష్ణ, తేలప్రోలు శ్రీనివాసరావు, చెరుకూరి అంజిబాబు, శ్రీను, సుబ్బరామయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.



కారంచేడు టీడీపీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నేతలు

ఏలూరిపై వెల్లువెత్తిన అభిమానం

ఇంకొల్లు : ఎమ్మెల్యే ఏలూరి పుట్టిన రోజు వేడుకలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. టీడీపీ సీనియర్ నాయకులు డాక్టరు బోడాల శ్యాంసుందర్ ఆధ్వర్యంలో పాత స్టేట్‌బ్యాంకు వద్ద సుమారు 300 మందికి అన్నదానం నిర్వహించారు. ఏలూరి ఈ ప్రాంతానికి చేసిన సేవలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కేక్ కట్ చేసి ఏలూరి శుభాకాంక్షలు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ బోడాల శ్యాంసుందర్, మురళీకృష్ణ, కొల్లూరి పానకాలచౌదరి, శివాజీ, ప్రసాద్, గౌతమ్, వేణు పాల్గొన్నారు. మండలంలోని ఇడుపులపాడు, గంగవరం గ్రామాలలో కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. కరి వీరాంజనేయులు, బాపయ్య, గోరంట్ల కోటయ్య నాయకులు పాల్గొన్నారు.

కారంచేడు టీడీపీ కార్యాలయంలో ఏలూరి జన్మ దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చాగంటి లక్ష్మీనారాయణ, దగ్గుబాటి చౌదరి, జాగర్లమూడి ప్రహ్లాదు, పోతిని ఉదయ్, నల్లగొర్ల శ్రీరాములు, పోతిని నాగేశ్వరరావు, చాగంటి శాంతయ్య పాల్గొన్నారు.

ఘనంగా కర్తవ్య బోధ్ దివస్

ఒంగోలు విద్య, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం కర్తవ్య బో ధ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. జోనల్ ఇన్‌చార్జి బి.గుణప్రసాద్ అ ధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర సంఘటన కార్యదర్శి శ్రావణకుమార్ మా ట్లాడుతూ వివేకానంద జయంతి మొదలు సుభాష్‌చంద్రబోస్ జయంతి వరకు గల మధ్యదినాలలో ఏబీఆర్ఎస్ఎం సూచనల మేరకు ప్రతిజోన్ కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని చెప్పారు. కా ర్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.మల్లికార్జునరావు, జిల్లా ప్రధానకార్యదర్శి టి.దిలీప్‌చక్రవర్తి, బాధ్యులు రాధాకృష్ణశర్మ, మధుసూదన్‌రావు, శంకర్, నీ లంరాజు సుబ్బారావు, చంద్రశేఖర్, నరసింహారావు, పద్మనాభరావు, ఎంఎం కే.శర్మ, గంగాధర్, వెంకటేశ్వర్లు, శేషారావు పాల్గొన్నారు

కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- సంయుక్త కిసాన్ మోర్చ నేతల డిమాండ్
- ఒంగోలులో ట్రాక్టర్లు, బైక్‌లు, ఆటోలతో ర్యాలీ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : రైతులకు కేంద్రం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రమైన ఒంగోలులో ట్రాక్టర్లు, బైక్‌లు, ఆటోలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మినీస్టేడియం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ నెల్లూరు బస్టాండు, కలెక్టరేట్, చర్చిసెంటర్ మీదుగా మిరియాల పాలెం, ట్రంకురోడ్డు, పాత మార్కెట్, బాపూజీ కాంప్లెక్స్ మీదుగా అద్దంకి బస్టాండు వరకు సాగింది. అనంతరం కిసాన్ సంయుక్త మోర్చ జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీపీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలను దోపిడీ చేయడంలో బీజేపీ పాలకులు బ్రిటీష్ వారిని మించిపోయారని ధ్వజమెత్తారు. రైతు ఉద్యమ సమయంలో రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పలువురు రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ దేశాన్ని పాలించే నైతిక హక్కు బీజేపీకి లేదన్నారు. రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీని ఇంటికి పంపేందుకు దేశంలోని అన్ని శక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పమిడి వెంకట్రావు, చుంచు శేషయ్య, చావలి సుధాకరరావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాసులు, ఎం.ఎస్.సాయి, కోడూరి నాంచార్లు, కంకణాల ఆంజనేయులు, జార్జి, శేషయ్య, కె.వీరారెడ్డి, ఎస్‌డీ సర్దార్, శ్రీరామ్ శ్రీనివాసులు, పద్మ, చొప్పర జాలన్న, సాగర్, పరిటాల కోటేశ్వరరావు, జె.జయంతిబాబు, పెంట్యాల హనుమంతరావు, చెరుకూరి వాసు, బి.సుబ్బారావు, పిన్నిక శ్రీను, దాసరి సుందరం. వెజేండ్ల శివరాం, అంకయ్య, కె.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న రైతు సంఘాల నాయకులు

పెద్దన్న కవిత్వం ఆ పాత మధురం

అద్దంకిటౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : అల్లసాని పెద్దన్న కవిత్వం ఆ పాత మధురమని, ఆయన మనుచరిత్ర ఆంధ్ర సాహిత్యాన్ని మలుపు తిప్పిందని ఉపన్యాసకులు పాటిబండ్ల శ్రీమన్నారాయణ అన్నారు. ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక కమలేశ్వర స్వామి ఆలయంలో సృజన సాహిత్య సమావేశం నారాయణం బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అల్లసాని పెద్దన్న - మనుచరిత్ర అనే అంశంపై పాటిబండ్ల శ్రీమన్నారాయణ ఉపన్యసించారు. ఈ సందర్భంగా దేశభక్తుడు, దేశం కోసం పోరాడి సరిహద్దులలో ఎడమ కాలిని పోగొట్టుకున్న వీరజవాన్ మేదరమెట్ల భద్రయ్య దంపతులను సృజన బృందం, విశ్రాంత సుబేదార్ మేజర్ డాక్టర్ శేషారెడ్డి తదితరులు ఘనంగా సత్కరించారు. అనంతరం దేశభక్తిపై కవిసమ్మేళనం డాక్టర్ దేవపాలన నిర్వహించారు. కార్యక్రమంలో అనిల్ కుమార సూరి, గాడేపల్లి దివాకర్‌దత్తు, పాలపర్తి జ్యోతిష్మతి, డీవీఎం సత్యనారాయణ, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శేషతల్ప సాయి కవి సమ్మేళనంలో పాల్గొన్నారు.



వీరజవాన్ భద్రయ్య దంపతులను సన్మానిస్తున్న సృజన బృందం

ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న శంకర ఆసుపత్రి డాక్టర్ నీతా

కనిగిరి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో జనని చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కంటి వైద్య శిబిరంలో 93 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 55మంది కంటి ఆపరేషన్లకు అర్హులుగా శంకర కంటి ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారు. వారిలో ఆదివారం 36మందిని ప్రత్యేక వాహనంలో గుంటూరు శంకర కంటి ఆసుపత్రికి తరలించారు. రెండవ విడతగా మరో 19 మందిని మంగళవారం తరలించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. వైద్య పరీక్షలు నిర్వహించిన వారిలో డాక్టర్ నీతా, వైద్య సిబ్బంది ఉన్నారు. టీడీపీ నాయకులు జంషీర్ అహ్మద్, షరీఫ్, సుధీర్, తెలుగు మహిళలు వలంటీర్లుగా కంటి సంబంధ బాధితులకు సేవలందించారు. కంటి పరీక్షల కోసం వచ్చిన వారికి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి భోజన ఏర్పాటు చేయించారు.

నేరాల అడ్డుకట్టకు ప్రత్యేక చర్యలు

- డీఎస్పీ లక్ష్మీనారాయణ



పోలీసుస్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

ముండ్లమూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నేరాల అడ్డుకట్టకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, రోజూ వాహనాలు తనిఖీ చేయటంతో పాటు గ్రామాలపై నిఘా ఉంచాలని దర్శి డీఎస్పీ బీలక్ష్మీనారాయణ ఆదేశించారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. పలు కేసులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా దృష్టి సారించాలన్నారు. రోజూ వాహనాలు తనిఖీ చేయటం వల్ల రోడ్డు ప్రమాదాలు తగ్గి పోతాయన్నారు. వాహన చోదకుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించటంతో పాటు పత్రాలు కలిగి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకే వాహనం మూడు సార్లు పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేయాలన్నారు. మద్యం తాగి వాహనాలను నడపటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అలాంటి వారిని గుర్తించాలన్నారు. ఇటీవల మిరప కాయల కోతకు కూలీలు ఎక్కువ మందిని తీసుకు వెళ్తున్నారని, పరిమితికి మించి ఎక్కించు కోకుండా చూడాలని సూచించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవటం వల్ల నేరస్థులను సులువుగా గుర్తించటం జరుగుతుందన్నారు. పెండింగ్ కేసులను త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వై. నాగరాజు పాల్గొన్నారు.

కరుణించమ్మా.. గంగమ్మ తల్లీ



తాళ్లూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గుంటిగంగ సన్నిధిలోని గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మ తల్లిపై భక్తితో దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పెట్టి కరుణించమ్మ గంగమ్మ తల్లి అంటూ వేడుకున్నారు. తాళ్లూరు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. చల్లంగా చూడమ్మ గంగమ్మ తల్లీ అంటూ వేడుకున్నారు. పలువురు వాహనదారులు వాహనపూజలు చేయించారు. ఈకార్యక్రమంలో ఈవో వాసు, ఆలయకమిటీచైర్మన్ కొసనా గురుబ్రహ్మం, దేవదాయశాఖ ఆర్‌ప ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కాలువల పరిశీలన

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

ముండ్లమూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోదేపల్లి మేజరు కాలువలపై శిథిలావస్థకు చేరిన బ్రిడ్జీలు, కల్వర్టులను ముండ్లమూరు ఎన్‌ఎస్‌పీ డీఈ పూర్ణచందు, డీసీ ఛైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు, సిబ్బంది ఆదివారం పరిశీలించారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి కల్వర్టు, పొంచి ఉన్న ప్రమాదం' అనే శీర్షికన కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన అధికారులు ముందుగా అయోధ్య నగర్, ఈదర మధ్య సాగర్ కాలువపై శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిని పరిశీలించారు. అనంతరం వేముల, గాంధీ నగర్, శంకరాపురం వద్ద ఉన్న కల్వర్టులను పరిశీలించారు. కింది స్థాయి సిబ్బందికి నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. త్వరలోనే ఎస్‌ఈ దృష్టికి తీసుకు వెళ్లి నిధులు మంజూరు చేయిస్తామని డీఈ తెలిపారు. ఆయన వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లస్కర్లు, వివిధ గ్రామాల రైతులు ఉన్నారు.



అయోధ్యనగర్ - ఈదర మధ్య దెబ్బతిన్న బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎన్‌ఎస్‌పీ అధికారులు



వేటపాలెంలో జెండా విష్కరిస్తున్న తహసీల్దార్ పార్వతి, సెయింట్ ఆన్స్ కళాశాలలో జెండా వందనం, మేదరమెట్లలో జెండాకు వందనం చేస్తున్న ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో నేతాజీ

మురిసిన మువ్వన్నెల జెండా

చీరాలటౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలో ఆదివారం మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాల్గొన్నారు. ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శానిటేషన్ సిబ్బందికి యూనిఫాంలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఎంతోమంది త్యాగ వీరుల ప్రతిఫలాలను మనం పొందుతున్నట్లు వివరించారు. 2047 నాటికి ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలోని అన్నిరంగాలను అభివృద్ధి చేసి ముందంజలో ఉంచేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కమిషనర్ అబ్దుల్ రషీద్, కౌన్సిలర్‌లు, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు జాతీయ జెండాను ఎగురవేశారు. డీఎస్పీ ఎండీ మొయిన్, తహసీల్దార్‌లు పార్వతి, గోపీకృష్ణ జెండాను ఆవిష్కరించారు. సెయింట్ ఆన్స్ కాలేజ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.కె జగదీష్‌బాబు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, డైరెక్టర్ ఆఫ్ అక్రిడేషన్ డా. సి సుబ్బారావు పాల్గొన్నారు.

పంగులూరు : మండలంలో 76వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంపీడీవో కె.స్వరూపారాణి, తహసీల్దార్ సింగారావు, హెచ్ఎం రమాదేవి, డాక్టర్ బాలరాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి రాంబాబు జాతీయ పతాకాలను ఎగురవేశారు. పాఠశాలల వద్ద హెచ్ఎంలు, కార్యాలయాల వద్ద అధికారులు పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ, తేళ్ల నాగమ్మ, ఉపాధ్యక్షులు, శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, విశ్రాం ప్రొఫెసర్ బి.వీరనారాయణ, ఆర్మీ సైంటిస్ట్ రామారావు పాల్గొన్నారు.

బల్లికురవ : గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంపీడీవో కుసుమకుమారి, తహసీల్దార్ రవినాయక్, ఎంఈవో రమేష్, విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు జెండా వందనం చేశారు. కార్యక్రమాలలో ఉద్యోగులు, రాజకీయ నేతలు పాల్గొన్నారు.

మార్టూరు : తహసీల్దార్ టీ ప్రశాంతి, ఎంపీడీవో వై.శ్రీనివాసరావు, పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు వారి కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు.

పర్చూరు : గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో జాతీయ జెండా రెపరెపలాడింది. కోర్టు భవనాల సముదాయంలో న్యాయాధికారి ప్రశాంతి, తహసీలార్ కార్యాలయంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ప్రద్యూమ్నకుమార్, ఎస్సై మాల్యాద్రి జెండాను ఎగురవేశారు. కారంచేడు మండలంలో ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీడీవో కె.నేతాజీ జాతీయ జండాను ఆవిష్కరించారు.

చినగంజాం : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. తహసీల్దార్ జె.ప్రభాకరరావు, ఎంపీడీవో ఏ.శ్రీనివాసరావు, పీహెచ్‌సీ డాక్టర్ పి.సాయిశ్రీచరణ్, హెడ్ కానిస్టేబుల్ పి.రామలింగేశ్వరరావు, కడవకుదురు జనసేనపార్టీ కార్యాలయం వద్ద మండల ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి హరిబాబు, సచివాలయాల వద్ద సర్పంచ్‌లు, విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



అద్దంకి కోర్టు భవనాల సముదాయంలో జెండాను ఆవిష్కరిస్తున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

అద్దంకి : గణతం త్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అద్దంకి కోర్టు భవనాల సముదాయం లో సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి జెండా ఆవిష్కరించారు. తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమీషనర్ రవీం ద్ర, ఎంపిడీ ఓ శింగయ్య, సిఐ సుబ్బరాజు, ఆర్టీసీ డిఎం శ్రీమన్నారాయణ లు ఆయా కార్యాలయాల వద్ద జెండా లు ఆవిష్కరించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల లో అధికారులు, హెచ్ఎం లు జాతీయ జెండా లు ఎ గురవేశారు. ఆర్టీసీ బస్టాండ్ లో మొక్కలు నాటారు.

మేదరమెట్ల : తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఎంఈవో పున్నయ్య, ద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ మహమ్మద్ రఫీ, ఎస్ఐ సురేష్, జాతీయ జెండాను ఆయా కార్యాలయాలవద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.



కలెక్టర్ ద్వారా ప్రశంసాపత్రం అందుకుంటున్న హెచ్ఎం, విద్యార్థులు

పాఠశాలకు ప్రశంసాపత్రాలు

పంగులూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : దేశస్థాయిలో ప్రతిభచాటి పేరు గడించిన కొండమంజులూరు ఉన్నత పాఠశాల బాలికలు, ఆ పాఠశాల హెచ్ఎం గణతంత్ర వేడుకలలో కలెక్టర్ ద్వారా ప్రశంసాపత్రం అందుకున్నారు. గత ఏడాది ఆగస్టులో భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతవరణ మార్పులు శాఖ ఓజోన్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోస్టర్ కాంపిటేషన్‌లో పాఠశాల పదవతరగతి విద్యార్థిని పంచుమర్తి భవ్యశ్రీ దేశస్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, నవంబరులో దేశస్థాయి లో జరిగిన వైల్డ్ లైఫ్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలో మరో విద్యార్థిని బత్తుల వేదశ్రీకి మూడవ స్థానం లభించింది. బహుముఖ ప్రజ్ఞతో ప్రతిభచాటిన బాలికలు భవ్యశ్రీ, వేదశ్రీలతో పాటు వారిని ప్రోత్సహించి పాఠశాలకు, జిల్లాకు గుర్తింపు తెచ్చిన హెచ్ఎం అణితకు ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకలలో కలెక్టర్ ప్రశంసాపత్రం అందించి అభినందించారు. అవార్డును అందుకున్న హెచ్ఎం అణిత, విద్యార్థినులు భవ్యశ్రీ, వేదశ్రీని గ్రామపెద్దలు, ఉపాధ్యాయు లు అభినందించారు.

బాలికలకు బహుమతులు

యద్దనపూడి, (మార్టూరు) జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవం సందర్భంగా యద్దనపూడి మండలంలో ప్రాథమిక పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న ఇద్దరు బాలికలు అధికారులతో బహుమతులను అందుకున్నారు. వారిలో జాగర్లమూడి లోని ఎంపీపీ ఎస్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న టి హా రిక అనే బాలిక వీర్‌గాథా 4.0లో జిల్లా స్థాయిలో డ్రాయింగ్ పోటీలలో ప్రథమ బహుమతిని పొందింది. దాంతో ఈ బాలికకు ఆదివారం బాపట్లలో కలెక్టరు చేతుల మీదగా బహుమతిని అందచేశారు. సూరవరపుపల్లి లోని ఎస్సీ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న నల్లమద్ది జెస్సీ అనే బాలిక వీర్‌గాథా 4.0లో పేరాగ్రాఫ్ రైటింగ్ రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం లభించడంతో విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సర్వశిక్షా అభియాన్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చేతుల మీదగా బాలిక కు బహుమతిని అందజేశారు.

నేడు ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాలతో మంత్రి సమీక్ష

అద్దంకి, జనవరి26(ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులతో విద్యుత్ శాఖ మం త్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదివారం ఉదయం 11 గంటలకు అద్దంకి లోని నాగులపాడు రోడ్డు లో కామేపల్లి కళ్యాణ మండపం నందు సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సైకిళ్ళు పంపిణీ కార్య క్రమం లో మం త్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొననున్నారు.

పర్చూరు నియోజకవర్గంలో పండుగ వాతావరణం

- ఏలూరి క్యాంప్ కార్యాలయానికి తరలివచ్చిన ప్రముఖులు, అభిమానులు
- నలుగురు మంత్రులతోపాటు పలువురు ప్రజాప్రతినిధుల రాక
- గ్రీన్‌స్పార్క్ ఫౌండేషన్, శిక్షణ, ఫిట్‌నెస్ కేంద్రాలు ప్రారంభం
- భారీగా రుణాల పంపిణీ, ఉద్యోగ నియామకపత్రాలు అందజేత
- ప్రతి గ్రామంలోనూ సాంబశివరావు జన్మదిన వేడుకలు



శిక్షణ కేంద్రం ప్రారంభంలో మంత్రులు అనగాని, గొట్టిపాటి, స్వామి

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

పర్చూరు నియోజకవర్గంలో ఆదివారం పండుగ వాతావరణం కనిపించింది. అందుకు శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు జన్మదినోత్సవం ప్రధాన కారణమైంది. నియోజకవర్గ ప్రజలు, అభివృద్ధి కోసం ఆయన తీసుకున్న కొన్ని సరికొత్త నిర్ణయాల పట్ల ప్రజలు ఆసక్తి కనబర్చారు. మార్టూరు వద్ద ఉన్న క్యాంపు కార్యాలయంలో ఏలూరిని కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు, అభిమానులు బారులు తీరారు. అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలకు పెద్దసంఖ్యలో రోగులు తరలి వచ్చారు. దీంతో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యాలయ ఆవరణతోపాటు మార్టూరు నుంచి ఇసుకదర్శి వరకు .జాతీయ రహదారికి పడమర వైపు ఉన్న సర్వీస్ రోడ్డు మొత్తం రద్దీగా మారి ట్రాఫిక్‌కు తీవ్రఇబ్బందులు ఎదుర య్యాయి. గ్రామగ్రామాన ఆయన జన్మదిన వేడుకలు సందర్భంగా కేకులు కట్ చే శారు. రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయస్వామి, బీసీ జనార్ధన్‌రెడ్డి ఏ లూరి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు హాజరయ్యారు. ఒంగోలు ఎంపీ మాగుంటతోపాటు ఆయా నియోజకవర్గాలకు చెందిన సుమారు 25 మంది ఎమ్మెల్యేలు, పలువురు ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు, భారీస్థాయిలో టీడీపీ నాయకులు తరలివచ్చి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన వేడుకలను ఏలూరి ఆదర్శవంతంగా చేసుకున్నారు. పూలదండలు, బొకేలకు స్వస్తి పలకడంతో అభిమానుల నుంచి నోట్సులు, పెన్నులు భారీగా వచ్చాయి. 57 మందికి లస్కర్ పోస్టుల ఉద్యోగాలకు నియామక పత్రాలను అందించారు. తాను నిర్వహించిన రెండు జాబ్ మేళాలో పలు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు సంపాదించుకున్న వారికి నియామక పత్రాలను అందజేశారు. ఇవి కాక దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, ఇతర ఉపకరణాలను పంపిణీ చేశా రు. అమరావతి హాస్పిటల్స్ సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి, ఏలూరి ట్రస్టు ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరానికి భారీ సంఖ్యలో రోగులు వచ్చారు.

ఇటు ఫౌండేషన్, అటు శిక్షణ కేంద్రాలు ప్రారంభం

నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు, ఆయా వర్గాల జీవనోపాధికి ఉపయోగపడేలా ఎమ్మెల్యే ఏలూరి ఏర్పాటు చేసిన గీన్‌స్పార్క్ ఫౌండేషన్ అధికారికంగా ఆదివారమే ఆవిర్భవించింది. దాన్ని మంత్రి స్వామి ప్రారంభించారు. అలాగే భారీ వ్యయంతో నిర్మించిన జిమ్ కేంద్రాన్ని (ఫిట్‌నెస్ సెంటర్)ను మంత్రులు అనగాని, గొట్టిపాటి ప్రారంభించారు. కార్యక్రమానికి వచ్చిన రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కొన్ని రోడ్ల నిర్మాణానికి చెందిన నిధులు మంజూరు చేసినట్లు హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని 525 డ్వాక్రాసంఘాలకు రూ. 22.42లక్షల మేర రుణ మంజూరు పత్రాలను మంత్రులు అనగాని, గొట్టిపాటి అందజేశారు.

విద్యార్థులకు పెన్నులు, పుస్తకాల పంపిణీ



బాలికలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

చినగంజాం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పుట్టినరోజు సందర్భంగా టీడీపీ మండల నాయకులు చినగంజాం బీసీ బాలికల వసతి గృహంలోని బాలికలకు, రాజుబంగారుపాలెం ఎస్టీకాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాత పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. టీడీపీ చినగంజాం గ్రామ అధ్యక్షుడు చెరుకూరి రాఘవయ్య ఆధ్వర్యంలో, బాపట్ల పార్లమెంట్ ఎస్టీ సెల్ కార్యదర్శి అద్దూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, టీడీపీ నాయకులు బెల్లంకొండ రమేష్‌బాబు, పర్వతరెడ్డి పార్థసారిథి, రసూరికుమార్, అద్దూరి సాల్మన్, సాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్చూరు : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు జన్మదిన వేడుక సందర్భంగా యద్దనపూడి మండలం జాగర్లమూడి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు ధూళిపల్లి వెంకటస్వామి ఆధ్వర్యంలో నేతాజీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. పర్చూరుకు చెందిన తంగెళ్ల మల్లినర్జునరావు వృద్ధులకు భోజన వసతిని ఏర్పాటు చేశారు.

అధికారులకు ఉత్తమ సేవా అవార్డులు

చీరాలటౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పురస్కరించకుని జిల్లా కలెక్టర్ వెంకటమురళి చేతుల మీదుగా పోలీస్, వివిధ ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన అధికారులకు సిబ్బందికి ఉత్తమ సేవా అవార్డులు అందించారు. అయితే ఈ అవార్డులు పెద్ద సంఖ్యలో చీరాల పరిధిలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి రావడం విశేషం. చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, డీఎస్పీ ఎండీ మొయిన్, చీరాల తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం, వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు, రూరల్ సిఐ శేషగిరిరావు, కానిస్టేబుల్స్ పిచ్చయ్య, రవిబాబు, చీరాల ఫైర్‌మన్ నాశిన వెంకటశివాజీ, స్వచ్ఛంద సంస్థ నాదెండ్ల కోటేశ్వరరావు అవార్డులు అందుకున్నారు. దీంతో వీరిని పలువురు ప్రశంసించారు.

చినగంజాం : తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావుకు ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రాన్ని కలెక్టర్ జె.వెంకటమురళి, జేసీ ప్రఖర్‌జైన్ అందజేశారు. ప్రభాకరరావును సిబ్బంది, సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు అభినందనలు తెలిపారు.

పంగులూరు : పంగులూరు మండల సర్వేయర్ బండి సురేష్ ఉత్తమ సర్వేయర్‌గా ఎంపికయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన గణతంత్ర వేడుకలలో కలెక్టర్ ద్వారా సురేష్ ప్రశంసాపత్రం అందుకున్నారు. ఉత్తమ సర్వేయర్‌గా ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్న సురేష్‌ను తహసీల్దార్ సింగారావు అభినందించారు.

పర్చూరు : ఉత్తమ వ్యవసాయాధికారిగా పర్చూరు ఏడీఏ ఎస్.మోహన్‌రావు ఎంపికయ్యారు. ఈసందర్భంగా ఆదివారం బాపట్లలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ వెంకటమురళి ద్వారా అవార్డును అందుకున్నారు.



సీఎండీ నుంచి అవార్డును అందుకుంటున్న విద్యుత్ ఈఈ మస్తానరావు



ఎస్పీ నుంచి అవార్డును అందుకుంటున్న బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి

బల్లికురవ : బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి గత ఎన్నికల విధుల్లో బాధ్యతగా పనిచేసినందుకు ఉత్తమ సేవా అవార్డును ఎస్పీ తుషార్‌డూడీ ద్వారా అందుకున్నారు. సర్వే డిప్యూటీ తహసీల్దార్ ప్రహర్షకు కలెక్టర్ ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రాన్ని అందజేశారు. గుంటుపల్లి విద్యుత్ లైన్‌మన్ ఎం.విజయను ఉత్తమ లైన్‌మెన్‌గా ప్రశంసాపత్రం అందజేశారు. సహచర అధికారులు, ఉద్యోగులు వారికి అభినందనలు తెలిపారు.

ఉత్తమ విద్యుత్ డివిజన్‌గా అద్దంకి

అద్దంకి : విద్యుత్ శాఖలో ఏపీసీపీడీసీఎల్ స్థాయిలో ఉత్తమ డివిజన్‌గా అద్దంకి ఎంపికైంది. ఆదివారం విజయవాడలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో జరిగిన కార్య క్రమంలో అద్దంకి ఈఈ నల్లూరి మస్తాన్‌రావు సీఎండీ భాస్కర్ నుంచి అవార్డు అందుకున్నారు. డీఈఈలు, ఏఈలు, సిబ్బంది మస్తాన్‌రావుకు అభినందనలు తెలిపారు.

అద్దంకిటౌన్ : వివిధ మండలలో పని చేస్తున్న అధికారులకు గణతంత్ర వేడుకలలో ఉత్తమ అధికారులుగా ప్రశంసపత్రాలను అందుకున్నారు. అద్దంకి ఎంపీడీవోగా పని చేస్తున్న బత్తిన సింగయ్య ఉత్తమ ఎంపీడీవోగా కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసపత్రాన్ని అందుకున్నారు. ఈవోఆర్‌డీ ప్రసాద్ ప్రశంసపత్రాన్ని అందుకున్నారు. మోదేపల్లి క్లస్టర్ సీసీగా పని చేస్తున్న తాళ్లూరి శ్రీనివాసరావుకు ఉత్తమ సీసీగా పీడీ పద్మ చేతులమ మీదుగా ప్రశంసపత్రాన్ని అందుకున్నారు.



కలెక్టర్ వెంకటమురళి నుంచి అవార్డులు అందుకుంటున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, డీఎస్పీ ఎండీ మొయిన్, తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం, వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు, రూరల్ సీఐ శేషగిరిరావు, తహసీల్దార్ ప్రభాకరరావు, ఏడీఏ మోహన్‌రావు, ఎంపీడీవో సింగయ్య, ఈవోపీఆర్డీ ప్రసాద్



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

దివ్యాంగులు మనోధైర్యంతో సాగాలి

ఎమ్మెల్యే కొండయ్య

చీరాలటౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలని వారికి ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో సుమారు 15 మంది దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లను ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం నుంచి సంక్షేమాలు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. వారికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేస్తామన్నారు. వేటపాలెం మండల పరిధిలోని చల్లారెడ్డి పాలెం ఎంజేఆర్ ఇంగ్లీషు మీడియం స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయనతోపాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి రోటరీ సాయం

అద్దంకిటౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పేద విద్యార్థి శిక్షణకు సాయం అందించారు. ఆదివారం కట్టకిందపాలెంకు చెందిన అత్తెవరపు మధుబాబు పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా ఫిలిమ్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలో ఉత్తీర్ణుడై మెయిన్స్ శిక్షణ కోసం హైదరబాద్ వెళ్లాలి. శిక్షణకు కావాల్సిన రూ.16వేల సాయాన్ని అందజేశామని రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. సాయమందించిన రోటరీ సభ్యులకు మధుబాబు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడా పరికరాలు, నోట్ పుస్తకాల పంపిణీ

పంగులూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు, నూజెళ్లపల్లి గ్రామాలలో పాఠశాల విద్యార్థులకు క్రీడా పరికరాలు, నోట్ పుస్తకాలను పంపిణీ జరిగింది. చందలూరు ఉన్నత పాఠశాలలో యోగా, ఇతర క్రీడలలో రాణిస్తున్న క్రీడాకారులను ప్రోత్సహిస్తూ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ సుమతి రూ.10వేల విలువ చేసే యోగా దుస్తులు, మ్యాట్‌లతో పాటు పలు క్రీడా పరికరాలను అందచేశారు. నూజెళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విశ్రాంత ఉపాధ్యాయిని విజయలక్ష్మి రూ.8వేల విలువ చేసే నోట్‌బుక్స్, కాపీరైట్ పుస్తకాలను అందచేశారు. పాఠశాల బాలబాలికలకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా గ్రామానికి చెందిన వ్యాపారి పచ్చిపులుసు నాగేశ్వరరావు భోజనం ఏర్పాటు చేసి వితరణ చాటారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు గిరిజ, వీరాంజనేయులు, విశ్రాంత హెచ్ఎంలు నార్నె తాతయ్య, ఝాన్సీ, పీడీ ప్రతిమ, అడ్డగడ సుబ్బయ్య, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యోన్నతి ఫౌండేషన్ మెరిట్ టెస్ట్ విజేతలు

అద్దంకిటౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : విద్యోన్నతి ఫౌండేషన్ ద్వారా పదవ తరగతి విద్యార్థులకు ఇంటర్ మీడియట్‌లో స్కాలర్‌షిప్ ఇచ్చేందుకు జనవరి 5వ తేదీన నిర్వహించిన మెరిట్ టెస్ట్‌లో విజేతలైన విద్యార్థుల వివరాలను అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ కార్యాలయంలో ఫౌండేషన్ డైరెక్టర్ ధూళిపాళ్ల వీరనారాయణ విడుదల చేశారు. అద్దంకి, జె.పంగులూరు, ఇంకొల్లు మండలాలకు సంబంధించి 5 గురు చొప్పున 15 మందికి ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇంటర్‌లో స్కాలర్‌షిప్‌ను ఫౌండేషన్ ప్రధాన దాత ధూళిపాళ్ల షర్మిల ప్రియాంక సౌజన్యంతో అందిస్తామని వీరనారాయణ తెలిపారు. మలాది శ్రీనివాసరావు, పట్టణాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎం.త్రిమూర్తులు, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ తాళ్లూరి బాబూరావు, గాడిపర్తి రామాంజనేయులు, ఆంజనేయులు విద్యార్థులందరి తరపున అభినందనలు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు తాత్కాలిక అంతరాయం

చీరాలటౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో నేడు విద్యుత్ సేవలకు అంతరాయం కలుగుతున్నట్లు అధికారులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈక్రమంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైకుంఠపురం, ఉజిలీపేట, జయంతిపేట, రోశయ్యకాలనీ, కారంచేడు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

డ్రైవర్‌కు గాయాలు

అద్దంకి, జనవరి26(ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొనడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికుల తెలిపిన వివరాలివి. ఆదివారం ఉదయం అద్దంకి పట్టణం సమీపంలోని శింగరకొండ రోడ్డులో ముందు వెళ్తున్న లారీని వెనుక వెళ్తున్న మరో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక లారీ డ్రైవర్ ఆర్. బాబుకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రిలో చేర్పించారు. లారీ ముందు భాగం నుజ్జయింది. పొగమంచుతో ముందు వెళ్తున్న లారీ కన్పించకపోవడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన లారీ

యువకుడు మృతి



గోపి (ఫైల్)

అద్దంకి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో డ్రైవర్ యలగాల గోపి (28) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బల్లికురవ మండలం ముక్తేశ్వరానికి చెందిన యలగాల వీరనారాయణ కుటుంబం అద్దంకిలోని కలవకూరు రోడ్డులో వైఎస్సార్ అపార్ట్‌మెంట్ సమీపంలో ఇళ్లు కొనుగోలు చేసుకొని నివాసం ఉంటున్నారు. జార్లపాలెం సమీపంలో పొలం వద్దకు ఆదివారం వీరనారాయణ, కుమారుడు గోపి వెళ్లారు. ట్రాక్టర్‌ను కుమారుడు గోపి తీసుకు వస్తుండగా, మోటార్‌సైకిల్‌పై తండ్రి వీరనారాయణ ఆదివారం సాయంత్రం అద్దంకి వైపు వస్తున్నారు. బెంగళూరు హైవే నిర్మాణం జరిగే ప్రాంతానికి వచ్చే సరికి ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో మార్జిన్‌లో పడిపోయింది. తీవ్ర గాయాలైన గోపిని అద్దంకి లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్సకు ఒంగోలులోని వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనా స్థలాన్ని సుబ్బరాజు పరిశీలించి కేసు నమోదు చేశారు.

బెల్టు షాప్ నిర్వాహకుడు అరెస్ట్

18 మద్యం సీసాలు స్వాధీనం

వేటపాలెం(చీరాలటౌన్), జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. అందిన సమాచారం మేరకు.. దాడులు నిర్వహించి అతడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నాగేశ్వరరావు తెలిపారు.